PRGI Reg No -“APTEL/26/A1193
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 24, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 14 - మార్చి - 2026 , వెల రూ.5/-

# రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

- పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట
- ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం
- కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు
- గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం



**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ - మిగతా 2 లో

# ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!




- ఏపీ వ్యాపారులకు గుడ్ న్యూస్
- ఏపీలోని ప్రధాన ప్రాంతాల్లో 24 గంటలూ షాపుల నిర్వహణకు అనుమతి
- సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఉద్యోగులకు వారానికి 48 గంటల పని, ఓవర్ టైం చెల్లింపు తప్పనిసరి
- 20 మందికి పైగా సిబ్బంది ఉన్న సంస్థలకు లైఫ్ టైమ్ రిజిస్ట్రేషన్ అవకాశం



# ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణస్వీకారం
- లిసా గిల్ తో ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా
- న్యాయరంగంలో జస్టిస్ లిసాకు అపారమైన అనుభవం

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని
- ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు
- బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు



**ఢిల్లీ :**
ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు. అసోంలోని - మిగతా 2 లో



# వారిని అంతం చేస్తున్నా

- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు
- అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు

# ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే భారీ పేలుడు

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు
- పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం
- హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం
- పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు



**ఢిల్లీ :**
ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.ప్రస్తుతం ఈ ఘటనలో - మిగతా 2 లో



# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ
- హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించాం
- పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు
- 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన

# అమిత్ షాకు కేటీఆర్ లేఖ



- రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు
- అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు

# గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం
- ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు
- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ
- ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం




**హైదరాబాద్ :**
తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## నవ నేపాల్

ఇది జెన్‌జీ విజయం అంటున్నారంతా. నేపాలీలు గత పాలకులపట్ల ఎంత ఆగ్రహంగా ఉన్నారో బాలెన్‌షా ఘనవిజయం స్పష్టంగా తెలియచెబుతోంది. ఒక పార్టీ మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి రావడమన్నది ఆ దేశం ఎన్నడూ చూడనిది. పదిహేడేళ్ళ ప్రజాస్వామ్య చరిత్రలో , చివరకు 2008లో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మావోయిస్టులకు కూడా దక్కనంత అపూర్వమైన ప్రజాదరణ రాష్ట్రీయ స్వతంత్రపార్టీకి లభించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రబీ లామిచేని, కాబోయే ప్రధాని బాలెన్‌షాలను భారతప్రధాని నరేంద్రమోదీ అభినందించి, పరస్పర సహకారంతో కలసి సాగుదామనడం, వారిద్దరూ చక్కగా, సానుకూలంగా ప్రతిస్పందించడం బాగుంది.సినిమా ఆఖరుఘట్టంలో దుష్టనాయకులను జనం తరిమితరిమికొట్టినట్లుగా నేపాల్ ప్రజలు తమకు నచ్చనివారిని అవమానకరమైన రీతిలో దింపేశారు. ఇది క్షణికావేశమనీ, సోషల్‌మీడియా నిషేధం ద్వారా ఖడ్గప్రసాద్ శర్మ ప్రభుత్వం కొరివితో తలగోక్కుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసిన సోషల్ మీడియా సంస్థలను చూసీచూడనట్టుగా వదిలివేసి ఉంటే నేపాల్‌లో ఏ మార్పూ ఉండేది కాదా? అన్నది అటుంచితే, ప్రజల్లో ఏళ్ళతరబడి గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా పెల్లుబుకడానికి ఆ నిషేధం దోహదం చేసింది. పాలకులు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నా, వీధుల్లోకి వచ్చిన జనం నాయకులను దించేసేవరకూ వెనక్కుపోలేదు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్నవారిని ఒక మహోద్యమంతో స్వల్పకాలంలోనే గద్దెదించేసిన ప్రజలు తగిన విచక్షణతో సరైనవారిని ఎన్నుకోగలరా? అన్న ప్రశ్నకు సమాధానంగా నేపాలీలు ఇప్పుడు బాలెన్‌షాను ముందుకు తెచ్చారు. పాతతరాన్ని వెనక్కునెట్టి, నవనాయకత్వాన్ని అధికారంలో కూచోబెట్టుకున్నారు.బాలెన్ సారథ్యంలో నేపాల్ ఒక కొత్త ప్రయాణం ఆరంభించింది. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, పహాడీలు, మధేశీలు అంటూ ఒక విభజన ఉండేది. ఇప్పుడు కొండ, లోయ ప్రాంతాలవారిద్దరూ ఒక్కటిగా బాలెన్‌కు పట్టం కట్టారు. మధేశీ, మైథిలీ మూలాలున్న వ్యక్తి ప్రధాని కావడం కూడా ఇదే మొదటిసారి. జెన్‌జీ ఉద్యమానికి నాయకత్వం వహించి నేపాలీలందరినీ ఏకతాటిపై నిలబెట్టడమేకాక, ఎన్నికలకు రెండునెలల ముందే ఆర్‌ఎస్‌పితో చేయి కలిపి దానికి ఘనవిజయాన్ని చేకూర్చడం విశేషం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతరత్రా చిన్నా చితకా పార్టీలన్నీ ఒక్కటై బాలెన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాయన్న భయం కూడా ప్రజల్లో ఉన్నందునే ఆయనకు ఇంతటి ఘన విజయం చేకూరి ఉంటుంది. జెన్‌జీ ఉద్యమం దెబ్బకు కకావికలైన నాయకులంతా తిరిగి ఎన్నికల బరిలో నిలవడం, పార్టీ అంతర్గత సంస్కరణల పేరిటా, హామీల పేరిటా మళ్ళీ మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో, ఎన్నికల అనంతరం వీరంతా ఒక్కటై తమ నెత్తిన కూచోకుండా ప్రజలు ముందుగానే జాగ్రత్తపడ్డారని అర్థం.అనాదిగా సంకీర్ణ ప్రభుత్వాలనే అనుభవిస్తూ వచ్చిన నేపాలీలు ఇకపై ఆ అవసరమే లేని ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకున్నారు. ఆయా రాజకీయపార్టీల మధ్య కుట్రలకు, వాటి నాయకుల మధ్య వెన్నుపోట్లకు తావులేకుండా చేశారు. అత్యంత కీలకమైన, విధానపరమైన నిర్ణయాలకు మోకాలడ్డుతూ తమదే పై చేయి కావడంకోసం ప్రజావ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు స్వస్తిపలికారు. దశాబ్దంన్నరకు పైగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఐదేళ్ళకు మించి నిలవని దేశంలో ఒక పార్టీకి కనీవినీ ఎరుగనంత మెజారిటీ కట్టబెట్టి సుస్థిరత సాధించుకున్నారు.ఒక గాయకుడు, ఒక టీవీస్టార్ చేయిచేయీ కలిపి అధికారంలోకి రావడం



బాగున్నది కానీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే పెద్ద సవాల్. పాలనానుభవం లేని ఈ యువనాయకుల మీద ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. పదిహేడేళ్ళుగా తమను మోసం చేస్తున్న నాయకుల మాదిరిగా వీరు వ్యవహరించబోరని, తమను అష్టదరిద్రాలనుంచి బయటపడవేస్తారని జనం ఆశిస్తున్నారు. ప్రజలు ఎక్కువ కాలం ఓపికగా నిరీక్షించలేరన్న మాట నిజమే కానీ, వారి ఆశలన్నీ నెరవేర్చలేకపోయినా, అవినీతి, ఆశ్రితపక్షపాతాలకూ ఖర్చుదారీ విధానాలకూ దూరంగా ఉంటూ దేశాన్ని క్రమంగా గాడినపెట్టడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తే అంతే చాలు. అధికారంలోకి రావడంకోసం అతివేగంగా ఒక్కటైన ఈ నాయకులు ఇద్దరూ రేపటిరోజుల్లో తమ మధ్య తలెత్తే విభేదాలను త్వరితంగా పరిష్కరించుకుంటూ ఐదేళ్ళూ కొనసాగడం మరింత ముఖ్యం.

# రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

**మొదటిపేజీ తరువాయి -** నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు



చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

# ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

**మొదటిపేజీ తరువాయి -**

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు.హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది.హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు ఇవే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్‌కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు.నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ)గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది.న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

**మొదటిపేజీ తరువాయి -**

కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహాటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు. "కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు.అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి - న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి - అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారీ అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!

**మొదటిపేజీ తరువాయి -** ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24 గంటలూ నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం-1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ వెసులుబాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించింది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది.అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉండగా, అదే సమయంలో ఉద్యోగుల హక్కులకు భద్రత కల్పించడం గమనార్హం.

## వారిని అంతం చేస్తున్నా

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే

**మొదటిపేజీ తరువాయి -** ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

## గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి -** సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**మొదటిపేజీ తరువాయి** - మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు.మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## అమిత్ షాకు కేటీఆర్ లేఖ



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు.తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం కు ఆహ్వానం



కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 13: నేటి శుభోదయ :జగ్గంపేట మండలం ఇర్రిపాక శివ కేశవుల ఆలయం వద్ద జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూకు వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం కు ఆహ్వానం పలికిన శ్రీ వైభోగుల, పెద్ద గొల్ల అప్పారావు, వైబోగుల నారాయణమూర్తి, వైభోగుల వీరపండు, వైభోగుల సత్తిబాబు, వైబోగుల గంగరాజు ఈ సందర్భంగా శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జగ్గంపేట కాకినాడ రోడ్ లో గల కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కన పెద్ద గొల్ల గారి వీధి లో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం మార్చి 15వ తేదీ ఆదివారం నుండి మార్చి 16వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని మా సాంప్రదాయ ఆట తప్పిడి గుళ్ళు తో గంగమ్మ తల్లికి నీరాజనం పలుకుతామని 16వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూని ఆహ్వానం పలికేందుకు వచ్చామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యావన్మంది భక్తులు కూడా విచ్చేసి ఆ గంగమ్మ అమ్మ వారి తీర్థప్రసాదాలు స్వీకరించి ధరించవలసిందిగా కోరుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైభోగుల శ్రీనివాస యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్, జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షులు మొరుకుర్తి రాజు యాదవ్, వైభోగుల వీరపండు, వైభోగుల సతీష్, వైభోగుల వీరబాబు అధిక సంఖ్యలో యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా "ప్రముఖ కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి



కాకినాడ జిల్లా, జగ్గంపేట మర్చి 13 నేటి శుభోదయ :జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు విభాగం ప్రముఖ తెలుగు కవయిత్రి శ్రీమతి మొల్ల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ మొల్ల చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించి తదుపరి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 13 నా కవయత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిందామని తెలిపారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవయిత్రిగా నిలిచారని, ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందిందని తెలిపారు. మొల్ల తన సాహిత్యంతో మహిళల ప్రతిభను ప్రపందానికి పరిచయం చేసిన గొప్ప కవయిత్రి అని విద్యార్థులకు తెలియజేశారు. మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871 పద్యాలతో కూడుకున్నదని, ఈ కావ్యాన్ని మొల్ల కేవలం 5 రోజులలో రాసిందని ప్రతీతి, అని విద్యార్థులకు తెలియజేశారు.తదుపరి తెలుగు విభాగం అధ్యాపకురాలు డా.డి. సత్యలత మాట్లాడుతూ మొల్ల జీవిత విశేషాలు, ఆమె రచించిన మొల్ల రామాయణం తేట తెలుగులో, గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేదిగా ఉంటుందని విద్యార్ధులకు తెలియజేశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన మొల్ల తన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచారని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ బాలరాజు , ఐ. క్యూ.ఏ, సి కో-ఆర్డినేటర్ డా. పి .వి.వి. సత్యా నారాయణ , అకడెమిక్ కో-ఆర్డినేటర్ డా.జి. సురేష్ , కెమిస్ట్రీ ఆధ్యాపకులు వి. మల్లికార్జున శర్మ , గణిత ఆద్యాపకులు సి.హెచ్.ఝాన్సీదేవి , ఫిజిక్స్ ఆద్యాపకులు వి. గోపాలకృష్ణ , కామర్స్ ఆధ్యాపకులు పి.పద్మ శేఖర్ మరియు కె.వెంకట రావు, జువాలజీ ఆద్యాపకులు పి.శ్రీనివాస రావు , బోటని ఆధ్యాపకులు పి.నవీన , కంప్యూటర్ ఆధ్యాపకులు వి.దేవి ప్రసన్న, ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయప్రాంగణంలో!..

### కొబ్బరికాయ విక్రయవేలం పాటనిర్వహణ!..లడ్డు ప్రసాదాలు విక్రయ వేలం పాట!..

### శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు!..



వి.ఆర్.పురం,మార్చి13(నేటి శుభోదయ ప్రతినిధి)శ్రీరామగిరి వంచాయంతీలోని,శ్రీరామగిరి గ్రామంలో,ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయ అమ్మకం పాట,లడ్డు ప్రసాదాల,విక్రయంపాట నిర్వహించామని శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు,వివరించారు. శుక్రవారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో,శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్,జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు, నేతృత్వంలో బహిరంగవేలం నిర్వహించారు.ఈవేలంలోకొబ్బరికాయల విక్రయపాటను సీతంపేట గ్రామానికి చెందిన పెదపెట్ల పవన్ కళ్యాణ్, 1,26,000/- వేల రూపాయలకు పాటను దక్కించుకున్నారు.అదేవిధంగా లడ్డు,ప్రసాదాలు విక్రయాల పాటను,శాఖ మాధవి,భద్రాచలం 50,000/-వేలరు రూపాయలకు దక్కించుకున్నారని,శ్రీరామగిరి దేవస్థానంచైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు,పేర్కొన్నారు.ఈకార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, ఉప సర్పంచ్ కొడిసెల దుర్గారావు, బీరక సూర్య ప్రకాశరావు,సి.పి.ఎం,పార్టీ నాయకులు, కమ్మచిచ్చు సత్యనారాయణ,గుండెపూడి లక్ష్మణరావు, నెర్రిబోయిన రాజు, జనసేన నాయకులు పెద పెట్ల పవన్ కళ్యాణ్,దేవాలయ అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు,ఆలయ సిబ్బంది కొండబాబు,వెంకన్న దొర,కూటమి నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## అందరూ ఆహ్వానితులే!..

### ముస్తాబౌతున్నరాజుల స్వామి!.. కోరినకోర్కెలుతీర్చే రాజులస్వామి!.. పందిరికార్య క్రమం!..



వి.ఆర్.పురం,మార్చి13(నేటి శుభోదయ ప్రతినిధి)దశమి శుక్రవారం రాజుల స్వామిపందిరి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించామని ఆలయ ప్రధాన పూజారి సారా పాండు రాజు,తెలియజేశారు.శుక్రవారం ఈసందర్భాన్నిపురస్కరించుకుని, 15.3.2026. అనగా ఆదివారం రోజున రాజులస్వామి వారిని, పూజారిఇంటివద్ద నుంచి తీసుకొని,గణచారులు కుల పెద్దలు,భక్తులు, గ్రామస్తులు కలిచి నగిడివద్దకుతీసుకొనివస్తారు. రాజుల స్వామివారిని అలంకరిస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.డోలు,సన్నాయి, డప్పులుతో ధూప, దీప, నైవేద్యాలు, రాజులస్వామి, వార్లుకీసమర్పిస్తారని ఆలయ పూజారి సారా పాడు రాజు,వివరించారు .ఈకార్యక్రమలో భక్తజనులుపాల్గొని, జయప్రదం చేయాలని, రాజులస్వామి ఆలయ పూజారి సారా పాండు రాజు,కోరిపార్థిస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన సమాజం



గోకవరం-నేటిసుబోదయ:. మండల కేంద్రమైన :గోకవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి అవగాహన సదస్సు, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మహబూబ్ వలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, రసాయన రహిత ఆహారం ప్రాముఖ్యతపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా ప్రతి గ్రామంలో 125 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని, ఖరీఫ్ ప్రణాళికలో ఇందుకు వెలుగు సిబ్బంది పూర్తి సహకారం అందించాలని కోరారు. మహిళా సంఘాల ద్వారా పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, జీవ వనరుల కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సాయం అందిస్తామని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు, పేద మహిళలకు ఈ విధానం ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జయంత్ రాజు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


## విలువలతో కూడిన విద్యకు రాజా కాన్వెంట్ నిలయం



గోకవరం-నేటిసుబోదయ :పేద,మధ్యతరగతి కుటుంబాలకు విద్యను అందించి ఉన్నతమైన శిఖరాలను అధిరోహించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఒక రాజా కాన్వెంట్ కే దక్కుతుందని టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మంగరౌతు రామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ధనాపేక్ష లేకుండా విద్యార్థుల భవిష్యత్తును ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాజా కాన్వెంట్ చైర్మన్ పట్నాల సూర్యప్రకాశ్రావు చేస్తున్న కృషిని గోకవరం ప్రజలందరం చాలా దగ్గరగా చూశామన్నారు. ఈరోజు ఎంతోమంది విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించడానికి, ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించడానికి రాజా కాన్వెంట్ చేసిన కృషి మరువలేనిదని రామకృష్ణ తెలిపారు. మా యొక్క స్వగృహానికి ప్రక్కనే రాజా కాన్వెంట్ ఉండడంవల్ల ప్రతిరోజు అక్కడ జరిగే విద్యా కార్యక్రమాలను కనులారా తిలకించడానికి అవకాశం దక్కిందన్నారు.

## కల్తీ పాలు తాగి మృతి చెందిన బండార వీరలక్ష్మి కుటుంబానికి రూ.10,00,000

### - చెక్కుని అందజేసిన రాజానగరం ఎమ్మెల్యే 'బత్తుల'



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం స్వరూప నగర్ లో కల్తీ పాలు తాగి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన బండార వీరలక్ష్మి కుటుంబాన్ని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహాయ నిధి నుంచి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.10,00,000 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బలరామకృష్ణ అందజేశారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా గుల్లా ఏడుకొండలు నియామకం.



గోకవరం-నేటిసుబోదయ :జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు గుల్లా ఏడుకొండలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైనట్టు తాడేపల్లి సెంట్రల్ ఆఫీసు నుండి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ పట్ల ఆయన నిబద్ధత, ప్రజలతో ఉన్నఅనుబంధాన్ని, సీనియారిటీని గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించేయున్నారని శుక్రవారం ఇచ్చిన ఒక పత్రికా ప్రకటన లో తెలియ చేశారని తెలిపారు.ఈ పదవి అందించిన గౌరవ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఆయన సామర్థ్యాన్ని విశ్వసించి, ఈ పదవికి తగిన నాయకుడిగా సిఫార్సు చేసిన జగ్గంపేట నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తొట నరసింహం కి కాకినాడ జిల్లా వైస్సార్ పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజాకి, వైస్సార్ పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్ అయిన బొచ్చ సత్యనారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్




ఢిల్లీ, ఏలూరు, నేటి శుభోదయ ::: డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో హానికరమైన కంటెంట్, వాడకం నుండి పిల్లలను రక్షించడానికి అనేక చర్యలను చేపట్టినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. సోషల్ మీడియా వాడకం పిల్లలపై, వారి మానసిక ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు గురువారం లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) చట్టం, 2000, పిల్లల డేటా రక్షణ (డిపిడిపి చట్టం, 2023), ఇండియా ఏఐ మిషన్ కింద సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో హానికరమైన కంటెంట్ పిల్లలను రక్షించడానికి అనేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో హానికర కంటెంట్ వ్యాప్తి నిరోధానికి తీసుకుంటున్న చర్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం చెబుతూ చట్టాన్ని ఉల్లంఘించే కంటెంట్ ను పోస్ట్ చేయడం లేదా షేర్ చేయడాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు నిరోధించాలని ఆదేశించినట్లు తెలిపారు. సమాచార భద్రతలో మానవ వనరుల వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ భద్రత అంశాలపై సాధారణ అవగాహనను కల్పించడానికి ఐఎస్ ఈఏ పై మిట్ వై ఒక ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు, దేశవ్యాప్తంగా 4,309 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయనీ, వీటిలో పాఠశాల/కళాశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థలు, ప్రభుత్వ సిబ్బంది మరియు సాధారణ ప్రజలు సహా 9.63 లక్షల మంది పాల్గొన్నారని, పాఠశాల పిల్లలు, విద్యార్థుల కోసం 1,186 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయని కేంద్ర మంత్రి వివరించారు.

## రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు అందజేత



చింతూరు డివిజన్ (నేటి శుభోదయ):అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలుగుదేశం మండల అధ్యక్షులు మహమ్మద్ జమాల్ ఖాన్ మండల వ్యాప్తంగా ఉన్న 2807 మంది రైతులకు ఒక్కొక్కరికి 6000 రూపాయలు చొప్పున మొత్తం 1. 68 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆయన సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ టి డి ఏ ఏవో రాజకుమార్ , మాజీ సర్పంచ్ సోడి శ్రీనివాసరావు, జాఫర్, మొట్టు శీ రాజయ్య, ప్రసన్న సంబంధిత అధికారులు నాయకులు రైతులు పాల్గొన్నారు.



## కోరుకొండ మండలంలో ఈ నెల 16 నుంచి పదో తరగతి పరీక్షలకు సన్నాహాలు పూర్తి..

### - మండలంలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు. 1158 మంది విద్యార్థులు హాజరుకానున్నారు..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.);పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 16 వ తేదీ నుండి ఏప్రిల్ 1 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కోరుకొండ మండలశీ మొత్తం ఆరు పరీక్ష కేంద్రాల నందు 1158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు నిర్వహనకు సిబ్బందిని నియమించామని మండల విద్యాశాఖ అధికారి టి.కుశలవ దొర తెలియజేసారు. 6 గురు చీప్ సూపర్నెంట్స్, 6 డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, మరియు ఇన్విజిలేషన్, ఇతర సిబ్బంది నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల నందు ఫర్నిచర్, మంచినీళు ,, కరెంట్, బాత్రూం సదుపాయాలు అన్ని ఏర్పాట్లు చేయడమైనదాని టి.కుశలవ దొర వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయవలసిందిగా మండల విద్యాశాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ధ్వజస్తంభ పునర్నిర్మాణ కార్యక్రమాల ప్రారంభం



యాడికి మార్చి 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని కమలపాడు పంచాయతీలో స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ పునర్నిర్మాణము ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు శుక్రవారం మొదలయినాయి. పంచ వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గణపతి పూజ, గోపూజ, స్వస్తి పుణ్య వాచనము, మాతృకా పూజ , పంచగవ్య మేళనం, రుత్వికరణ, రక్షాబంధనం కలిసి పూజ మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయము అల్పాహారము, మధ్యాహ్నం విందు భోజనము, రాత్రికి భోజనాలు ఏర్పాటు చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ గంగవరం ఫ్యామిలీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ ఆది, తాంద్ర విక్రమ్, రూపునేని రాజశేఖర్ చౌదరి, మొదలైన టిడిపి నాయకులు స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది..



## క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేసిన ఆధాని గ్రూప్



యాడికి మార్చి 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ సుమంత్ రెడ్డి అధర్యంలో 16 మంది టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేయటం జరిగిందని వైద్యాధికారులు తెలిపారు. టీబి సూపర్వైజర్ సునీల్ మాట్లాడుతూ టీబీ రోగం వచ్చినవారికి ప్రభుత్వం నుండి నెలకు 1000 రూపాయలు వస్తుంది. అలాగే అదానీ గ్రూపు తరుపున సిఎస్అర్ రామరాజు సమక్షము లో పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవ్వరన్న దాతలు వస్తే వారి ద్వార కూడా అందిస్తామని తెలిపారు. టిబి వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతూ మీరు క్రమం తప్పకుండా మాత్రలు వేసుకొని టిబి రోగం జయించవచ్చునని తెలిపారు . ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ రామచంద్ర, కుష్టు వ్యాధి, క్షయవ్యాధి నోడల్ అధికారి రాంప్రసాద్, సిహెచ్ఓ జుబేధ, పీహెచ్ ఎన్ శోబా పాల్గొన్నారు...

## వేడుకగా 'కడియం నూతన ప్రెస్ క్లబ్ ' కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం..

### - నూతన అధ్యక్షులుగా చిక్కాల సూరిబాబు..



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కడియం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కడియం జీ ఎన్.ఆర్ కళ్యాణమండపంలో ప్రముఖుల మధ్య ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్ట్ చిక్కాల సూరిబాబు, ఉపాధ్యక్షునిగా యండమూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా పాలగుమ్మి శేషగిరి, బొమ్మిరెడ్డి బ్రహ్మాజీ, కార్యదర్శి గా అన్నందేవుల సూర్యచంద్ర రావు, ట్రెజరర్ గా కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం,సలహాదారునిగా పల్ల గిరి కార్యవర్గ సభ్యులుగా దూడల అర్జున్, శెట్టి పోసిబాబు, వేపకాయల వీరభద్రరావు,ఎడ్ల నరేష్, అడ్డగళ్ళ దుర్గా ప్రకాష్, అడ్డగళ్ళ రాము, నేల రాజేష్,అబ్బారి రామకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్ లు ప్రమాణ స్వీకారం చేశారు. జీ ఎస్ ఆర్ ఫౌండేషన్ ట్రస్టీ, టీడీపీ రాష్ట్ర నాయకులు గోరంట్ల రవి కిరణ్ కడియం ప్రెస్ క్లబ్ లోగోను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తొలుత వైసిపి రూరల్ కోఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కడియం ప్రెస్ క్లబ్ ప్రమాణస్వీకారాచ్యానికి విచ్చేసి జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు వెలుగుబంటి సత్యవర ప్రసాద్, మండల వైసీపీ అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జమ్మి, మండల బిజెపి అధ్యక్షులు బొరుసు సుబ్రమణ్యం, రాష్ట్ర టిడిపి నాయకులు అన్నందేవుల చంటి, బిజెపి నియోజకవర్గ నాయకులు ఆకుల శ్రీధర్, ఐఎన్ఏ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రమణ్యం, పీవీసీ నర్సరీ అధినేత తాడాల చక్రవర్తి, జనసేన నాయకులు ఆదిమూలం సాయిబాబా, రాజమహేంద్రవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, సత్యదేవ నర్సరీ యాజమాన్యం పుల్లా చిన సత్యనారాయణ, రాజశేఖర్, వీర్రాజు, వైసీపీ నాయకులు కొత్తపల్లి మూర్తి,సాధనాల బాబ్జీ,కూటమి నాయకులు గట్టి సుబ్బారావు, పుల్లా రామారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి,గుర్రపు కొండయ్య మాస్టారు, సూరపరెడ్డి భరత్, తూము శ్రీనివాసు, చెల్లుబోయిన శ్రీనివాస్, మినర్వా స్కూల్ అధినేత వెంకటేశ్వర రావు, ఫెర్టిలైజర్స్ సయూనియన్ అధ్యక్షులు రావిపాటి రామకృష్ణ,సర్పంచ్ లు చెక్కపల్లి మురళి, కొండపల్లి పట్టియ్య, మారిశెట్టి పద్మావతి , జనసేన, వైసీపీ మహిళా నాయకులు బోడపాటి రాజేశ్వరి, ఊటుకూరి శైలజ, వైసీపీ నాయకులు తోకల శ్రీనివాస్, టేకి శ్రీనివాస్, ముసునూరి రాంబాబు,ధవలేశ్వరం సిఐలు వెంకటేశ్వరరావు, గణేష్ , పలువురు పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ సీఈఓలు,మండల అధికారులు హాజరయ్యారు.

## కేజీబీవి లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



చింతూరు డివిజన్ (నేటి శుభోదయ):పోలవరం జిల్లా చింతూరు మండల కేంద్రం లోని కేజీబీవి పాఠశాల మరియు కళాశాల నందు 6 వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది అని పాఠశాల ప్రిన్సిపాల్ డి. రమాదేవి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి లో 40సీట్లకు అలాగే ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను 40 సీట్లకు విద్యార్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ దరఖాస్తులను మార్చి 12 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు స్వీకరిస్తామని అన్నారు. కనుక ఆసక్తి గల విద్యార్థులు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



## జిల్లా కోర్టులో మౌలిక సదుపాయాలు

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఢిల్లీ,ఏలూరు, నేటి శుభోదయ :: ఆంధ్ర ప్రదేశ్ లో జిల్లా సబార్డినేట్ కోర్టులలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకోసం గత 5 ఏళ్లలో 104.29 కోట్ల నిధులు విడుదల చేయగా, 94.23 కోట్లు విలువైన పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు . ఏలూరు సహా ఏపీ లోని జిల్లా కోర్టుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు శుక్రవారం లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 2025-26 ఏడాదికి గాను 30.98 కోట్లు కేటాయించగా, 20.92 కోట్లు ఇప్పటికే వినియోగించినట్లు చెప్పిన కేంద్ర మంత్రి, మరో 10.06 కోట్ల విలువైన పనులు జరుగుతున్నట్లు వివరించారు. జడ్జిల నివాస గృహాలు, కోర్టు భవనాల నిర్మాణం, ఇతర సదుపాయాల కోసం ఈ నిధులు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం 1993-94 నుండి న్యాయవ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రాయోజిత పథకం (సిఎస్ఎస్) ను అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ లో జిల్లా, సబార్డినేట్ కోర్టులలో ఖాళీలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ రాష్ట్రంలో జిల్లా, సబార్డినేట్ కోర్టులలో మొత్తం 84 జడ్జిల, న్యాయాధికారుల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 4 ఖాళీలు ఉన్నట్లు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. కోర్టు హాళ్ళు, న్యాయ అధికారుల నివాస యూనిట్లు, న్యాయవాదుల హాళ్లు, టాయిలెట్ కాంప్లెక్స్‌లు మరియు డిజిటల్ కంప్యూటర్ గదులు.ఏలూరు జిల్లా కైకలూరు సహా 33 జిల్లా, సబార్డినేట్ కోర్టులలో మౌలిక సదుపాయాలు, నిర్మాణ పనులు పూర్తికాగా, మరో 12 కోర్టులలో పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు

## కోరుకొండలో ప్రశాంతంగా మండల సర్వ సభ్య సమావేశం..!

**సర్పంచ్లు, ఎం.పి.టి.సి.లను శాలువాలు, పూలమాలలతో సత్కరించిన ఎం.పి.డి.ఓ. అశోక్ కుమార్..**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు మరియు సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. కోరుకొండ ఎంపీపీ ఉల్లి సూర్య కుమారి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అభివృద్ధి, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. సర్పంచులు మరియు ఎంపీటీసీలు తమ గ్రామాల్లోని పలు సమస్యలను సంబంధిత శాఖ అధికారులకు వివరించారు. వాటిపై ఎంపీడీవో అశోక్ కుమార్ స్పందించి, అధికారులు తగిన సమాధానాలు అందించారు. అలాగే సర్పంచులకు, ఎంపీటీసీలకు పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో సర్పంచులకు, ఎం.పి.టి.సి.లను సాలువలు కప్పి పూలమాలలుతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి.టి.సి. కర్రి నాగేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బొరుసు సత్యవతి, తహశీల్దార్ సుగుణ, సర్పంచ్లు నక్కా రాంబాబు, శ్రీమతి కర్రి లక్ష్మీ సరోజ గణేష్, ఎం.పి.టి.సి. పీతా శ్రీను, దేవుడమ్మ, వీరబాబు, కోటి సర్పంచ్ దుర్గారావు, కడియాల పాపారావు, తదితరులు హాజరయ్యారు.

## ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

**కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ జి. కవిత**




మాచర్ల : ఆర్ సి ఇన్చార్జి మార్చి13; నేటి శుభోదయ : పల్నాడు జిల్లా మాచర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం( కే జి బి వి )2026 - 27 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కస్తూరి గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు. ఈ సందర్భంగా మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపల్ జి, కవిత మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మీసేవ కేంద్రం ద్వారా లేక గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవొచ్చు. అని దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, విద్యార్థిని యొక్క పాస్పోర్ట్ సైజ్ ఫోటో, రేషన్ కార్డు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తోపాటు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆరవ తరగతి ప్రవేశం కు 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరానికి ఒకేషనల్ కోర్స్, కంప్యూటర్ సైన్స్, గ్రూపు 40 సీట్లు ఉన్నట్లు 12వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు

## దైవ చింతనతో చెన్నయ్యస్వామి తిరునాళ్ల సాగాలి..!

**భక్తుల పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని సహించను..!**

**అధికారులతో బ్రహ్మోత్సవాలపై జూలకంటి సమీక్ష..!**




మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి మార్చి 13; నేటి శుభోదయ :పల్నాటి ప్రజల ఆరాధ్యదైవం, స్థానికంగా కొలువుదీరిన శ్రీ లక్ష్మీ చెన్నకేశస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు దైవ చింతనతో సాగాలని అధికారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఆలయ కళ్యాణ మండపంలో ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే తిరునాళ్ల మహోత్సవాలపై నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం, దివ్య రథోత్సవ క్రతువులకు భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తారని, ఆశేషంగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రధానంగా మున్సిపల్, పోలీస్, విద్యుత్, ఫైర్, హెల్త్ వంటి తదితర శాఖలు సమన్వయంతో కలిసి పని చేసి, తిరునాళ్లను విజయవంతం చేయాలని చెప్పారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న మాచర్ల చెన్నయ్య స్వామి తిరునాళ్లకు మరింత కీర్తి తీసుకొచ్చేలా అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహించే.., ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆధ్యాత్మిక వాతారణంలో సాగే తిరునాళ్ల మహోత్సవంలో ఎటువంటి రాజకీయ దురుద్దేశాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు. ఈ సందర్భంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురజాల డీఎస్పీ వెంకట రమణ, తహశీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, పట్టణ సీఐ వెంకటరమణ, ఆలయ ఈవో సైదయ్య, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, ఆలయ కమిటి చైర్మన్ కొమెర అనంతరాములు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష సెంటర్ల పరిశీలన.




నేటి శుభోదయ - వెలుగోడు :నంద్యాల జిల్లా ప్రతినిధి :ఈ నెల 16 తేది నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నంద్యాల జిల్లా ఎస్ఎస్ సి అబ్జర్వర్ అనురాధ తెలిపారు. వెలుగోడు మండలం లోని పరీక్ష సెంటర్ల ను శుక్రవారం ఆమె పరిశీలించారు. వెలుగోడు మండలం లో మూడు పరీక్ష సెంటర్ల ను ఏర్పాటు చేశారు. వెలుగోడు జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్ కు చీఫ్ సూపరింటెండెంట్ గా లలిత కుమారి, డిపార్ట్మెంట్ అధికారి గా నరసింహులు, 14మంది పరీక్ష సిబ్బంది లను నియమించారు. ఈ సెంటర్ లో 259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు మండల విద్యాశాఖధికారి బ్రహ్మం నాయక్ తెలిపారు. డిపాల్ హైస్కూల్ లోని సెంటర్ లో చీఫ్ సూపరింటెండెంట్ గా గఫూర్ సాహెబ్, డిపార్ట్మెంట్ అధికారి గా రాంప్రసాద్, సహాయ డిపార్ట్మెంట్ అధికారి గా ప్రసాదరావు లను నియమించారు. ఈ సెంటర్ లో 340 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కానున్నారు. అలాగే మండలం లోని వేల్పనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లోని పరీక్ష సెంటర్ కు చీఫ్ సూపరింటెండెంట్ గా సత్యవేదమణి, డిపార్ట్మెంట్ అధికారిగా జి ఎల్ ఎన్. నరసింహులు లను నియమించారని తెలిపారు. ఈ సెంటర్ లో 134 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కానున్నట్లు అధికారి చెప్పారు. మూడు సెంటర్ల సిబ్బందికి పరీక్ష సెంటర్ నందు అనుసరించాల్సిన పద్ధతి పై సూచనలు ఇచ్చారు. పరీక్ష సెంటర్ లో విద్యార్థులకు కావాల్సిన బెంచీలు, త్రాగునీరు మిగతా అన్ని వసతులు కల్పించినట్లు ఎం. ఇ. ఓ చెప్పారు.

## ముఖ్యమంత్రి కిసాన్ నిధుల విడుదలను విక్షించిన రైతులు.



నేటి శుభోదయ - వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి :వెలుగోదు మండలం లో 5827 మంది రైతులకు 3 కోట్ల 38 లక్షల రూపాయలు అన్నదాత సుఖీబవ, పి ఎం కిసాన్ నిధులు విడుదల అయినట్లు వ్యవసాయ అధికారిణి స్వాతి తెలిపారు.వెలుగోడు రైతు సేవా కేంద్రం నందు ముఖ్యమంత్రి రైతు భరోసా నిధుల విడుదల పోగ్రామ్ ను రైతులు విక్షించారు.ఈ కార్యక్రమం లో ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వంగాల కృష్ణ రెడ్డి, వెలుగోడు మండల టిడిపి పార్టీ ప్రెసిడెంట్ అబ్దుల్ కలాం , వెలుగోడు పి ఏ సి ఎస్ చైర్మన్ శంకర్ రెడ్డి, వ× ఎంపీటీసీ తెలుగు రమణ,అబ్దుల్లాపురం రఘు స్వామి రెడ్డి ఇంకా నగర ప్రముఖులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న సేవలో మనకూటమి ప్రభుత్వం

**- ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పిన ప్రకారం రైతులకు రూ.20వేలు ఇచ్చి మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

**- ఓ రైతన్నా, మీ సేవలకు మా సెల్యూట్ అన్నా**

**- అన్నం పెట్టే రైతన్న శ్రమ విలువ వెలకట్టలేనిది**

**- పుట్టపర్తి నియోజకవర్గంలో 44348 రైతుల ఖాతాకు రూ.26.10 కోట్లు చెక్ ను ఎమ్మెల్యే జెసి ఆర్డిఓ చేతుల మీదుగా విడుదల**

**- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**




పుట్టపర్తి, బుక్కపట్నం, నేటి శుభోదయ ::: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజవర్గంలోని బుక్కపట్నం మండల కేంద్రంలో శుక్రవారం అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ 3విడత ద్వారా రైతుల ఖాతాల్లో రూ.6 వేలు జమ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జేసి మంత్రి మౌర్య భరద్వాజ్,ఆర్డీఓ సువర్ణ ,జిల్లా వ్యవసాయాధికారి కృష్ణయ్య , మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాదికి 20 వేల చొప్పున అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రైతుల ఖాతాలో మూడు విడుతలుగా రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మందికి రూ.6600 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం లో 44 348 మంది రైతులకు 26. 10 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. సత్యసాయి జిల్లాలో సుమారు 2,65,040 మంది రైతులకు రూ.155.26 కోట్లు మంజూరు చేశామని తెలిపారు .వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రం మనదన్నారు. అన్నం పెట్టే రైతుల శ్రమ విలువ వెలకట్టలేనిది అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పొందే విధంగా రైతులకు రాయితో పంట సాగు డ్రోన్లు ,మందుల పిచికారి డ్రోన్లు సాంకేతిక పరిజ్ఞానం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఐటీ విప్లవ కర్త ముఖ్యమంత్రి చంద్రబాబే అని కొనియాడారు. ప్రభుత్వం వ్యవసాయ రైతాంగానికి ప్రభుత్వ రాయితీతో అందిస్తున్న డ్రిప్పు స్ప్రింకర్లు డ్రోన్లు వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రైతాంగాన్ని కోరారు.జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కింద ఏడాదికి 20 వేలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బులు జమ చేస్తోందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వ్యవసాయంలో నూతన సాంకేతిక విధానాలతో పంటల సాగు విధానాల్లో మేలైన వంగడాలతో తక్కువ ఖర్చు చేసి ఎక్కువ పంట లాభాన్ని పొందాలని రైతులకు సూచించారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ రాయితీ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలానికి అనుగుణంగా రైతులు లాభదాయకమైన పంటలు సాగు చేసి అధిక లబ్ధి పొందాలని సూచించారు. అంతకుముందు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న వ్యవసాయ డ్రోన్లు మందుల పిచికారి విధానాలను ఎమ్మెల్యే పల్లె సింధూర తో పాటు జాయింట్ కలెక్టర్ ,ఆర్డిఓ ,రైతులతో కలిసి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే నవధాన్యాల విధానాలను మహిళా రైతుతో అడిగి తెలుసుకొన్నారు. అంతకుముందు రైతులు సిద్ధప్ప, కేశవులు ,కేశవరెడ్డి సాగు చేస్తున్న పంటలు వచ్చిన ఆదాయాన్ని రైతులకు వెల్లడించారు. అనంతరం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన 44348 మంది రైతులకు రూ.26.10 కోట్లు నిధుల చెక్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆర్డిఓ సువర్ణ ,జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య మండల వ్యవసాయ అధికారి నటరాజ్ చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు యశోద రాయుడు,శ్రీనివాసులు,సహకార సొసైటీ అధ్యక్షులు చెన్నకృష్ణ , మండల వ్యవసాధికారి నటరాజ్ , తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ గంగులప్ప ,మార్కెట్ యార్డ్,సాగునీటి సంఘం పాలకవర్గ సభ్యులు,సహకార సొసైటీ సభ్యులు రైతులు ,కూటమి పార్టీల సభ్యులు చింతా మల్లిరెడ్డి,లావణ్య ,సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.




## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి



యాడికి మార్చి 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ మూడో విడత పంపిణీ కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో పెద్దవడుగూరులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే జే సి అస్మిత్ రెడ్డి హాజరు కావడం జరిగింది. రైతులు వినూత్నంగా ఆలోచించి కొత్త పంటలు కొత్త వంగడాలపై దృష్టి సారించాలని అధిక దిగుబడులను పొంది రైతులు అభివృద్ధి చెందాలని కోరారు. రైతన్నను కష్టజీవిగా



గుర్తించాలన్నారు.నియోజకవర్గంలో తాడిపత్రిలో 7762 మంది రైతులకు 4.64 కోట్లు, పెద్దపప్పూరు లో 5732 రైతులకు 3.42 కోట్లు, పెద్దవడుగూరులో 9741 రైతులకు 5.86 కోట్లు, యాడికి మండలంలో 7022 మంది రైతులకు 4.25 కోట్లు జమ కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ మెగా చెక్కును రైతులకు అందజేయడమైనది.ఈ కార్యక్రమానికి గుత్తి డివిజన్ ఏరియా వెంకట రాముడు 4 మండలాల ఏవోలు రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు నియోజకవర్గ రైతులు హాజరు కావడం జరిగినది....

## ఇంటి మరియు నీటి పన్నులు 90 శాతము వసూలు.

నేటి శుభోదయ -వెలుగోడునంద్యాల జిల్లా ప్రతినిధి :2025-26 వ సంవత్సరానికి వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ డిమాండ్ 48,52,378 రూపాయలు ఉండగా అందులో 44,11,937రూపాయలు వసూళ్లు అయ్యాయని మిగిలిన బ్యాలెన్స్ 4,40,441వసూలు కావలసి ఉందని గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి నరేంద్ర తెలిపారు.అలాగే గ్రామములో మంచి నీటి కోలాయి పన్నులు నాన్ టాక్స్ కింద డిమాండ్ 22,19,999 లకు గానూ 17,82,636 రూపాయలు వసూళ్లు చేయడము జరిగిందని 4,37,363 వసూళ్లు కావలసి ఉందని అలాగే ట్రేడ్ లైసెన్సు 169,400ఉండగా 169,400 వసూళ్లు చేయడము జరిగిందని అలాగే వేలము పాట సంతమార్కెట్ 5,79,000 లకు గానూ 5,00,000 వసూళ్లు అయ్యాయని79,000/- వేల రూపాయలు రావాల్సి ఉందని, అలాగే బస్ స్టాండ్ 4,81,000 లకు గానూ 4,81,000వసూళ్లు అయ్యాయని అలాగే కబేళా 2,13,000 లకు గానూ 2,00,000 వసూళ్లు అయ్యాయని మిగిలిన 13,000 రూపాయలు వసూళు కావలసి ఉందని అలాగే సెల్ టవర్ డిమాండ్ 3000 లకు గానూ 3000 వసూళ్లు అయ్యాయని తెలిపారు.

## కోన కిడ్నాప్, పొక్సో కేసు కొట్టివేత

**-కృష్ణాజిల్లా పొక్సో కోర్టు తీర్పు**

మచిలీపట్నం మార్చి 13( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మచిలీపట్నం తాలూకా పోలీస్ స్టేషన్ లోని కోన గ్రామంలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి పొక్సో నేరాలు చేశాడని బందరు తాలూకా పోలీసులు పెట్టిన కేసును కొట్టివేస్తూ కృష్ణాజిల్లా ఫోక్సోకో ప్రత్యేక జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోన గ్రామానికి చెందిన తుమ్మ సుబ్బారెడ్డి (25) అనే నిందితుడు అదే గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలికను కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకుని వెళ్లి వేధింపులకు గురిచేసి పోక్సో నేరాన్ని పాల్పడ్డాడని 2019 జూన్ ఒకటో తేదీన మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు పై బందరు తాలూకా పోలీసులు పొక్సో మరియు కిడ్నాప్ సెక్షన్ల కింద నిందితుడిపై చార్జి షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో విభిన్న వాదనలతో నిందితులపై నేరం నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని నిందితుడి పై నేరం రుజువు కాలేదని కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి జి. వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు. నిందితుడి తరఫున లంకిశెట్టి బాలాజీ, మద్దాల సువర్ణ రాజు, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ న్యాయవాదులు గా వ్యవహరించారు.

# జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు

**7 - ప్రభుత్వ పరిశీలనలో జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్**

**- జర్నలిస్ట్ లకు త్వరలో శుభవార్త చెప్తాం**

**- ఏపీఎంపీఏ నేతలతో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



అమరావతి, నేటి శుభోదయ ::: జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర సమాచార సంబంధాల శాఖ కొలుసు పార్థసారథి చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందని కొలుసు పార్ధ సారధి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మంత్రిని మీడియా సెంటర్ లో కలసి జర్నలిస్టుల పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ త్వరలోనే తీపి కబురు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ తో పేర్కొన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందిగా మంత్రి ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్ లో జర్నలిస్టుల సమస్యలపై చర్చించామని త్వరలోనే వారికి శుభవార్త చెబుతామని తెలిపారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అవార్డుల పంపిణీ తో పాటు ప్రమాద బీమా సౌకర్యం, 20 లక్షలకు హెల్త్ కార్డుల పరిమితి పెంచడంతో పాటు పలు జర్నలిస్ట్ సంక్షేమ కార్యక్రమాలపై త్వరలోనే ఇది విధానము ప్రకటిస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏ.పి.ఎం.పి. ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర అధ్యక్షులు టి అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ జి శ్రీనివాసరావుతో పాటు పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

# గుడివాడలో కదులుతున్న బెట్టింగ్ డొంక

**మరో 20 మంది బుకీల పేర్లు బయటకు**

**- తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన మసాల శివ సామ్రాజ్యం**

**- పోలీసుల అదుపులో మరో గుడివాడ బుకీ**

**- ఆర్థిక లావాదేవీలన్నీ వైసీపీ నాయకుడి కనుసన్నల్లో**

అమరావతి, హైదరాబాద్, నేటి శుభోదయ ::: క్రికెట్ బెట్టింగ్ సామ్రాజ్యాన్ని కుకటి వేళ్లతో సహా పెకలించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది.ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మరో బుకీ, గుడివాడకు చెందిన నెంబర్ హోటల్ యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బెట్టింగ్ మాఫియా వృక్షం వేళ్లు తెలుగు రాష్ట్రాలకు పాకడంపై పోలీసులు విస్తుపోతున్నారు.ఇటీవల గుడివాడ మండలం గుంటాకోడూరు చేపల చెరువుపై స్పెషల్ బ్రాంచ్, గుడివాడ తాలుకా పోలీసుల దాడిలో పట్టుబడిన కలిపిండి శివ ఆలియాస్ మషాలా శివ ఆర్థిక లావాదేవీలన్నీ మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు చూస్తున్నట్లు సమాచారం. బెట్టింగ్ తాలుకా ఎంత నగదు ఎక్కడుంది, ఎవరి దగ్గరుంది, ఎవరి బ్యాంకు ఖాతాల్లో ఎంత ఉంది, ఎవరూ ఎంత బకాయి పడ్డారో సదరు నాయకుడి వద్ద వివరాలున్నట్లు సమాచారం. బెట్టింగ్ నగదు బకాయిల వసూళ్ల



వ్యవహారమంతా రామునే చూసుకుంటాడని పట్టణంలో వినికిడి. శివ పట్టుపడటంతో సదరు వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం.

**- 20మంది బుకీల పేర్లు**

మషాలా బండి నుంచి ప్రారంభమైన శివ ప్రస్థానం తెలుగు రాష్ట్రాలకు పాకింది. ఇతను నడుపుతున్న బెట్టింగ్ సామ్రాజ్యాన్ని చూసి పోలీసులకే కళ్లుతిరిగాయి. ఏ స్థాయిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నాడో అంతు చిక్కని పరిస్థితు లున్నాయి. పోలీసుల విచారణలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 20 మంది బుకిల పేర్లను వెల్లడించినట్లు సమాచారం. పేర్లను ప్రధానంగా పామర్రులో ఇద్దరు, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్లకు చెందిన వారి పేర్లు బహిర్గతమైనట్లు ప్రాథమికంగా తెలిసింది. గుడివాడ పట్టణంలోని హోటల్ యజమాని, మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నట్లు సమాచారం. ఏ నిమిషాన ఎవరి పేరు బయటకు వస్తుందనే టెన్షన్లో ఉన్నారు. పోలీసుల జోరుతో మాఫియాలో భాగస్వామ్యులైన కొందరు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు బెంబేలెత్తిపోతున్నారు.

**- జల్లెడ పడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు**

బెట్టింగ్ మాఫియాను కూకటి వేళ్లతో పెకలించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఈ మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. రానున్న రెండు, మూడు రోజుల్లో మరికొంత మంది బిగ్ షాట్ల అరెస్టులు ఉంటాయని తెలిసింది. విచారణ పూర్తి స్థాయిలో పూర్తవ్వడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# నేడు(శనివారం) బీసీ రక్షణ చట్టంపై కీలక భేటీ


**-బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి, మార్చి 13 ( అజయ్ నారగాని- నేటి శుభోదయ) వెనుకబడిన తరగతులు గౌరవ ప్రదమైన జీవనం సాగించడంలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై నేడు(శనివారం) జరగనున్న కీలక సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ .సవిత తెలిపారు. ఈ సమావేశంలో బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత పాల్గొనబోతున్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో హామీలో భాగంగా వెనుకబడిన తరగతులకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దీనిలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఇప్పటికే బీసీ మంత్రులు రెండు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు. మూడోసారి విజయవాడ నగరం తాడిగడపలోని బీసీ వెల్ఫేర్ డైరెక్టరేట్ లో శనివారం కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ పాల్గొంటున్నారన్నారు. బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ తో పాటు న్యాయ శాఖ కార్యదర్శి, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**బోడె ప్రసాద్**



పెనమలూరు, మార్చి 13 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఓటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రాష్ట్రంలోని ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెనమలూరు నియోజకవర్గం తాడిగడప గ్రామంలోజరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పి ఎం కిసాన్ యోజన కింద రైతులకు మూడో విడతగా 4 కోట్ల 29లక్షల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలోకి జమచేయడం జరిగిందనారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు ఆనందంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అన్నం పెట్టే రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మే నాయకుల్లో ముఖ్యుడు నారా చంద్రబాబు నాయుడు అని, అటువంటి నాయకత్వంలో మేము పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్, కంకిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ ధనరామ కోటేశ్వరరావు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ పాతపూడి గణేష్,రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం డైరెక్టర్ వెలగపూడి శంకర్ బాబు,పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయా ఆనంద్, పెనమలూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారుపూడి ధన కోటేశ్వరరావు, ఏ కుల విజయేంద్ర క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల రామ్ కుమార్ మహిళా నాయకులు యార్లగడ్డ సుచిత్ర పండుల రజిని మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 16వ తేదీ నుండి హాఫ్ డే స్కూల్స్

**-కృష్ణాజిల్లా డిఇఓ యు వి సుబ్బారావు.**




మచిలీపట్నం, మార్చి 13 ) అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈనెల 16వ తేదీ అనగా సోమవారం నుండి అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించడం జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు కృష్ణాజిల్లా డిఇఓ యువి సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పోలియో నిర్మూలన నిధుల సేకరణ కోసం రోటరీ గవర్నర్ సైకిల్ ర్యాలీ గుడివాడ చేరిక



గుడివాడ, మార్చి 13 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పోలియో నిర్మూలన నిధుల సేకరణ కార్యక్రమంలో భాగంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ చక్రవర్తి చేపట్టిన సైకిల్ ర్యాలీ శుక్రవారం గుడివాడకు చేరుకుంది. ఇచ్ఛాపురం నుండి విజయవాడ వరకు నిర్వహిస్తున్న ఈ సేవా యాత్రలో భాగంగా ఆయన సాయంత్రం 5 గంటలకు గుడివాడకు చేరుకోగా, స్థానిక రోటేరియన్స్ ఘనంగా స్వాగతం పలికారు.గుడివాడ సరిహద్దులోని ఇంజినీరింగ్ కాలేజ్ సమీపంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మరియు కార్యదర్శి ఆధ్వర్యంలో సభ్యులు సైకిళ్లతో స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఏలూరు రోడ్ గుండా సాగి రాజేంద్రనగర్లోని జి.వి.పి.ఆర్ కమ్యూనిటీ హాల్ వరకు కొనసాగింది.అనంతరం కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ చక్రవర్తి పోలియో నిర్మూలన కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, సమాజం అంతా కలిసి ఈ మహత్తర లక్ష్యాన్ని సాధించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గుడివాడ రోటేరియన్స్ సేవాభావంతో ముందుకు వచ్చి పోలియో నిర్మూలన నిధికి మొత్తం 1550 డాలర్లు విరాళంగా అందజేశారు. అదేవిధంగా సేవా కార్యక్రమాల భాగంగా కుమారి జ్వలిత శ్రీ లివర్ మార్పిడి చికిత్స నిమిత్తం సహాయంగా రూ.65,000 విరాళాన్ని ఆమె తండ్రికి డిస్ట్రిక్ట్ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమం రోటరీ సభ్యుల ఉత్సాహభరిత పాల్గొనటంతో విజయవంతంగా ముగిసింది. "పోలియో రహిత ప్రపంచం కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరం" అని రోటరీ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ వై. నాగేశ్వరావు, సెక్రటరీ కిరణ్ బాబు, అసిస్టెంట్ గవర్నర్ రమణ మూర్తి, క్లబ్ కౌన్సిలర్ జి. బాబు శ్రీకర్, ఎ. సుబ్రహ్మణ్యం తదితర రోటేరియన్స్ పాల్గొన్నారు.



# తేజ ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న రాష్ట్ర స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు

విజయవాడ, మార్చి 13 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) తేజ ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థ ఉగాది పండుగను పురస్కరించుకొని ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయవాడ హనుమంతరాయ గ్రంధాలయంలో రాష్ట్రస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తేజ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి డి. సాంబశివరావు తెలిపారు పోటీలలోని విజేతలకు ప్రధమ బహుమతి 1000లు, ద్వేతీయ బహుమతి 700లు తృతీయ బహుమతి 500లు ముగ్గురికి 200లు చొప్పున అందచేస్తారని తెలిపారు. సాయంత్రం టి. వి. ఆర్టిస్ట్ లచే ప్రతేక ప్రదర్శన, సభా కార్యక్రమం 7.30 గంటలకు జ్యోతి ప్రజ్వలన, స్వాగత ప్రార్ధన, ముఖ్య అతిధుల చే బహుమతి ప్రధానం, వివిధ రంగాలలోని నిష్టానాతులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# సీఎం చంద్రబాబు లక్ష్యం

**అన్ని బీసీ కులాలకు అసెంబ్లీ ప్రాతినిధ్యం**
**-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**-తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ రచనలకు ప్రత్యేకమైన స్థానం**
**-తొలి తెలుగు కవయిత్రి మొల్ల ఎందరికో ఆదర్శం**
**-శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి**
**-మొల్ల స్ఫూర్తి ప్రధాత : మంత్రి కొల్లు రవీంద్ర**
**-విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం**
**-మొల్లమాంబకు ఘన నివాళులర్పించిన మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర**

విజయవాడ, మార్చి 13 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) అన్నీ బీసీ కులాలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆమె తెలుగు కవయిత్రి కావడం తెలుగు జాతి అదృష్టమన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు పాల్గొని మంత్రి సవిత ప్రసంగించారు. తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత్రి మొల్లమాంబ అని అన్నారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి తొలిసారి రచించిన ఘనత కవయిత్రి మొల్లమాంబదేనన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు మొల్ల ఆదర్శనీయమన్నారు. మొల్ల రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



## బీసీలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

బీసీలకు సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. శాలివాహన ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను అమలు చేసి, కుమ్మరులకు పనిముట్లను సీఎం చంద్రబాబు అందజేశారన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో అమలు చేయనున్న ఆదరణ 3.0లో విద్యుత్ తో నడిచే ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. బీసీల్లో ఉన్న కులాలన్నింటికీ అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ రాబోతోందని, బీసీ అభ్యర్థులకు మరోసారి ఉచితంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నామన్నారు. గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీకి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర కుమ్మరి, శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపిన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మొల్ల స్ఫూర్తి ప్రధాత :

## -మంత్రి కొల్లు రవీంద్ర

వాల్మీకి రామాయణాన్ని తెలుగలోకి రచించిన మొల్లమాంబ అందరికీ స్ఫూర్తి ప్రధాత అని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. ఆయా కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆలోచని అని అన్నారు. కేవలం కార్పొరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి నిధులు సైతం కేటాయిస్తున్నారన్నారు. నూతన బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను బీసీ సామాజిక వర్గీయులు వినియోగించుకుని, అభివృద్ధి పథంలో పయనించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. అంతకుముందు తుమ్మలపల్లి కళా క్షేత్రం ఆవరణలో మొల్ల విగ్రహానికి మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రులు మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు సవితను, కొల్లు రవీంద్రను కుమ్మరి, శాలివాహన వర్గీయులు



ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి,శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, పాలకమండలి డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, కుమ్మరి/శాలివాహన సామాజిక వర్గీ యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నదాతల ఉన్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం..!

**-వరికపూడిశెల నిర్మించకుంటే మా కుటుంబమంతా రాజకీయ సన్యాసమే..!**
**-వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి చంద్రబాబు చేయూత**
**అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి**

వెల్దుర్తి : ఆర్ సి ఇన్చార్జి మార్చి 13 ;నేటి శుభోదయ :అన్నదాతల ఉన్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. అన్నదాత సుఖీభవ మూడో విడత నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శిరిగిరిపాడు శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్టాల్స్ ను, ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను,చిరు ధాన్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 38 వేల 926 మంది రైతులకు రూ. 21 కోటి, 89 లక్షల, 32 వేలు విలువచేసే నగదు చెక్కులను అందించారు. తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ.. అనాదిగా మూస ధోరణిలో సాగుతున్న సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి, ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేయాలని రైతులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతాంగానికి, వ్యవసాయానికి పెద్దపేట వేస్తూ.., అన్ని



విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, రైతు ఖాతాలో రూ. 20 వేల నగదును ఖాతాల్లో జమ చేశారని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వ్యవసాయాన్ని పండుగ వాతావరణం లో సాగు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. వ్యవసాయంతో పాటు అనుబంధం రంగాల అభివృద్ధికి గతంలో ఎన్నడు లేని విధంగా కృషి చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

## వరికపూడిశెల నిర్మించకుంటే మా కుటుంబమంతా రాజకీయ సన్యాసమే..!

పల్నాడు ప్రజల జీవనాడి వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించి, ప్రజలకు, రైతులకు అంకితం చేయకుంటే తమ కుటుంబమంతా రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఎమ్మెల్యే జూలకంటి తేల్చి చెప్పారు. 2029 నాటికి వరికిపూడిశెలను పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తాను పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలవగా, మన కూటమి ప్రభుత్వంలో వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించి, తీరుతామని కచ్చితమైన హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలానే మరోవైపు గ్రామీణ తాగనీటి అవసరాల కోసం రూ.1200 కోట్లతో జల్జీవన్ మిషన్ ద్వారా కేటాయించి, ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించామన్నారు. తాగు, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి జగదీశ్వర్ రెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి, ఎంపీడీఓ సాంబశివారావు, , ఎమ్మార్వో రాజశేఖర్ నాయక్, వెల్దుర్తి ఏవో బాలజీ గంగాధర్, దుర్గి ఏవో అమీర్ రెడ్డి, కారంపూడి ఏవో నరసింహారావు, మాచర్ల ఏవో పాపకుమారి, మాచర్ల ఏఎంసీ చైర్మన్ రాజబోయిన మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుర్రి శివారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కళ్ళం రామాంజిరెడ్డి, టిడిపి నాయకులు వజ్రం నాయక్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది అమావాస్య సందర్భంగా

భక్తులకు మనవి బుధవారం 18 3 2026 నాడు ఉగాది అమావాస్య సందర్భంగా కాలసర్ప దేవాలయంలో రాహు కేతు సహిత సర్పదోష నివారణ పూజలు జరుపబడుచున్న వి, ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుండి 1, వరకు విశేష పూజా కార్యక్రమంలో భాగంగా నవగ్రహ ఆరాధన సర్ప సూక్త పారాయణము నవగ్రహ హోమము దత్త హోమము సర్పహోమము కుజ గ్రహ కుజదోష నివారణకు హోమము రాహుకేతు హోమము నక్షత్ర హోమము వివిధ దేవత మూలమంత్ర మాల మంత్ర సహిత హోమములు మరియు మానసా దేవి సహిత ప్రత్యంగిరా హోమము జరుపబడుచున్నది ఈ కార్యక్రమంలో అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందిఈ పూజలో పాల్గొను భక్తులు మీ గోత్రము పేరు తెలియజేసి సంప్రదించగలరు 9010892893 టెంపుల్ నెంబర్

# ఐ.ఎన్.టి.ఎస్.ఓ లెవెల్ 2 లో చింతల బ్రాంచ్ విద్యార్థుల విజయకేతనం

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అభినందన**

హైదరాబాద్, చింతల్ :: శ్రీ చైతన్య స్కూల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐ. ఎన్. టి .ఎస్ .ఓ లెవెల్ 2 ఎగ్జామ్ లో శ్రీ చైతన్య స్కూల్ చింతల్ బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గ్రాండ్ ప్రైజ్ సాధించిన విద్యార్థి (అభినయ రెడ్డి లాప్టాప్), మొదటి బహుమతి సాధించిన విద్యార్థి(దిత్యా టాప్) లను అభినందించారు. గ్రాండ్ ప్రైజ్ మరియు మొదటి ప్రైజ్ సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో లాప్టాప్ , టాప్ లను అందించి వారిని అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రాండ్ ప్రైస్ -1, మొదటి ప్రైస్-1 , రెండవ ప్రైస్-1 మూడో ప్రైజ్- 2, నాలుగవ ప్రైస్ -2,ఐదవ ప్రైస్ -3,కన్సోలేషన్ ప్రైసెస్ -64,స్పెషల్ ప్రైసెస్-12 మరియు గోల్డ్ మెడల్స్ -116మొత్తం -202 మంది విద్యార్థులు సాధించాలని సాధించారని అన్నారు. ఐ ఎన్ టి ఎస్ ఓ లెవెల్ 2 లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి ,ఏ.జీ.ఎం శివరామకృష్ణ ,ఆర్. ఐ పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్స్ మురళీకృష్ణ మరియు వెంకట శివ ,పాఠశాల డీన్ సైదులు, సి ఇంచార్జ్ అంజలీదేవి, ప్రైమరీ ఇంచార్జ్ లావణ్య మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# పోమల్ పల్లి అభివృద్ధికి మరో అడుగు విద్యుత్ లైన్ మంజూరు

**గ్రామ అభివృద్ధే లక్ష్యం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్**

కేశంపేట, నేటి శుభోదయ :కేశంపేట మండలం పోమల్ పల్లి గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు కొండారెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పోమల్ పల్లి వరకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో చాలా కాలంగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పలుమార్లు కోరారు.ఈ నేపథ్యంలో కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ను కలిసి గ్రామానికి 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోమల్ పల్లి గ్రామానికి విద్యుత్ స్తంభాలు ఇప్పటికే చేరుకున్నాయి. త్వరలోనే కాంట్రాక్టర్ ద్వారా పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కొత్త విద్యుత్ లైన్ పూర్తయితే గ్రామానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. దీంతో గ్రామంలోని గృహాలు, రైతులు మరియు చిన్న వ్యాపారులు ప్రయోజనం పొందనున్నారు.తమ గ్రామానికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్కు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు

నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన పరీక్షా సామాగ్రి సద్వినియోగం చేసుకోవాలని, పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు పొందుతారని ప్రధానోపాధ్యాయులు యం. నరేందర్ తెలిపారు.చెరువుమాధారం ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్ మాట్లాడారు.విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, తల్లిదండ్రులు కన్నకలలు నెరవేర్చటానికి కృషిచేయాలని ప్రధానోపాధ్యాయులు నరేందర్ విద్యార్థులను కోరారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉజ్వల, యం శ్రీలత, ఎస్ శ్రీనివాస్, ఆర్ అరవింద్, వి కల్పవల్లి, పి వేణు, పి మంగేశ్వరి, బి ప్రసాద్, వి ఈశ్వరమ్మ, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి భవిష్యత్తు కు క్రమశిక్షణ, సమయపాలన పునాది

వైరా, నేటి శుభోదయ ::: విద్యార్థుల రేపటి భవిష్యత్తు కు క్రమశిక్షణ, సమయపాలన పునాది గా ఉపకరిస్తాయని పాలడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్ అన్నారు.పాలడుగు ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాలి సురేష్ బాబు, డి సునంద, ఎస్కే. ఇర్షాద్, జె. రవి తదితరులు పాల్గొన్నారు.

# గిర్గెట్పల్లిఅలంపల్లి రైల్వే గేట్ రహదారి వివాదం

**కలెక్టర్ ఆదేశాలతో స్థల పరిశీలన**
**పరిశీలనకు వచ్చిన పోలీస్ అధికారులు**



నేటి శుభోదయ వికారాబాద్ 13 మార్చి :వికారాబాద్ సమీపంలోని గిర్గెట్పల్లిఅలంపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేట్ రహదారి విషయంలో గ్రామస్తులు మరియు రైతులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. దాదాపు 100 సంవత్సరాలుగా ఈ రహదారిని రెండు గ్రామాల ప్రజలు తమ రాకపోకల కోసం, అలాగే రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉపయోగిస్తున్నామని వారు తెలిపారు.అయితే ప్రస్తుతం ఒక వ్యక్తి ఈ రహదారిపై రాకపోకలను అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో గ్రామాల ప్రజలు మరియు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మార్గానికి ప్రభుత్వం ఇప్పటికే బీటీ రోడ్డు మరియు స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో, ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రజలు మరియు రైతులు ఈ రహదారిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరారు.గామస్తుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ ప్రదేశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా సంఘటనా స్థలానికి పోలీసులు మరియు అధికారులు చేరుకొని పరిస్థితులపై సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ అక్కడి పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ వైస్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేకా చంద్రశేఖర్ రెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి, కొత్తగడి కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి వీరేష్ కుమార్, ఉమ్మెత్తల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే అలంపల్లి మరియు గిర్గెట్పల్లి గ్రామాలకు చెందిన గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


# మరో మహావతార్.. యానిమేటెడ్ ఫిల్మ్ ను డామినేట్ చేస్తుందా?



మహావతార్ నరసింహ.. ఇటీవల థియేటర్స్ లో రిలీజ్ అయిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. చిన్న మూవీగా రిలీజ్ అయ్యి పెద్ద విజయం సాధించింది. రియల్ సక్సెస్ అంటే ఏంటో అసలు రుచి చూపించింది. మొదటి రోజు నుంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతూ భారీ వసూళ్లను సాధిస్తోంది. శ్రీమహావిష్ణువు నరసింహ అవతారం ఆధారంగా అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించిన ఆ సినిమాను కన్నడ ప్రముఖ నిర్మాత సంస్థ హెూంబలే ఫిల్మ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ గ్రాండ్ గా రూపొందించింది. అయితే దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా ఇప్పటికే మహావతార్ నరసింహ మూవీ రికార్డు నెలకొల్పింది. ఇప్పటి వరకు రూ.200 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. దాదాపు నెల రోజులుగా సక్సెస్ ఫుల్ గా థియేట్రికల్ రన్ ను కొనసాగిస్తోంది. అయితే మహావతార్ ఫ్రాంచైజీ తదుపరి భాగం మహావతార్ పరశురామ్ 2025 నవంబర్ లో సెట్స్ పైకి వెళ్లనుంది. అంతకుముందు.. మహావతార్ నరసింహ మూవీ ఓటీటీలోకి రానుందని టాక్. అదే సమయంలో బాలీవుడ్ లో మహావతార్ అనే ఫీచర్ ఫిల్మ్ రూపొందుతోంది. అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో ప్రముఖ నటుడు విక్కీ కౌశల్ లీడ్ రోల్ లో నటించనున్నారు. ఇప్పుడు మహావతార్ నరసింహ భారీ విజయం తర్వాత ఈ సినిమా రిజల్ట్ ఎలా ఉంటుందోన్నది ఆసక్తికరంగా మారింది. నిజానికి.. విక్కీ కౌశల్ మహావతార్ మూవీ ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా సినిమా రిలీజ్ అవుతుందని ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. విక్కీ కౌశల్ ఇతర కమిట్మెంట్ల కారణంగా ఆలస్యమవుతూ వస్తోంది. మూవీ కోసం విక్కీ భారీ భౌతిక పరివర్తన చెందాల్సి ఉందని, అందుకే మేకర్స్ టైమ్ తీసుకుంటున్నారని టాక్ . అయితే మహావతార్ పరశు రామ్ 2027లో రిలీజ్ కానుంది. ఇప్పుడు విక్కీ కౌశల్ మహావతార్ కూడా అప్పుడే రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద విష్ణు అవతారంపై రెండు సినిమాలు దాదాపు ఒకే సమయంలో రూపొందుతున్నాయి. ప్రేక్షకులు వాటిని ఎలా స్వీకరిస్తారో చూడాలి. అంతే కాదు అటు యానిమేటెడ్ మూవీ.. ఇటు ఫీచర్ ఫిల్మ్.. ఏది ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి మరి.




# సమంత స్టన్నింగ్ లుక్‌కి ఫ్యాషన్ ప్రపంచం ఫిదా!







టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత తాజాగా ఓ స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. జీక్యూ పవర్ లిస్ట్ 2025 ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో ఆమె ధరించిన నెట్ డిజైన్ హై స్లిట్ గౌన్ లుక్‌కి నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. బ్లాక్ కాంబినేషన్‌లో మెరిసిన ఈ డ్రెస్‌కు మ్యాచింగ్ మేకప్, స్ట్రెయిట్ హెయిర్ స్టైల్ తో తన యాటిట్యూడ్‌ను మరింతగా హైలైట్ చేసింది. ఈ ఫొటోషూట్‌లో సమంత అటిట్యూడ్, కాన్ఫిడెన్స్, స్టైల్ అన్నీ కలిపి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌కి సూట్ అయ్యేలా ఉన్నాయి. ఆమె ఈ లుక్‌లో కేవలం గ్లామర్‌తోనే కాదు, తనలో ఉన్న స్ట్రాంగ్ వైబ్ ని చూపించగలిగింది. నెట్ మెష్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రస్సుకు స్లిట్ కట్ ఆకర్షణీయంగా ఉండి, సామంత యొక్క బోల్డ్ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు "ఈ లుక్‌తోనే మళ్లీ ట్రెండ్ లోకి వచ్చేసింది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. కెరీర్ పరంగా చూస్తే... తాజాగా ఆమె 'బంగారం' అనే సినిమాలో నటిస్తోంది. ఇది ఆమె కామ్‌బ్యాక్ మూవీగా ట్రీట్ అవుతోంది. అంతేకాదు, ఓ ఇంటర్నేషనల్ వెబ్ సిరీస్ అయిన 'రక్త బ్రహ్మాండ'లో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడిన సామ్ కొంతకాలం విరామం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో భాగంగా వ్యాయామం, ధ్యానం, వైద్య చికిత్సలను పక్కాగా అనుసరిస్తూ, ఇప్పుడు మళ్లీ షూటింగ్‌కి సిద్ధమవుతోంది. "ఆరోగ్యం కోల్పోయినప్పుడే మన అసలు బలాన్ని గుర్తించగలం" అంటూ గతంలో చెప్పిన సామ్ ఇప్పుడు మళ్లీ తన పని పట్ల కమిట్‌మెంట్ చూపిస్తూ, అన్ని ఫ్రంట్‌లలో ముందుకు వెళ్తోంది. ఈ తాజా లుక్‌ద్వారా ఆమె ఇప్పటికీ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచినట్టు మరోసారి ప్రూవ్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలు ఇప్పటికే లక్షల్లో లైక్స్ సంపాదించాయి. కామెంట్లలో అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్, గ్రేస్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

# సన్నని నడుములో శ్రియా లెహంగా హెుయలు






సినిమా రంగంలో తన నటనతో ఎంతగానో మెప్పించిన శ్రియా శరణ్... ఇప్పుడు ఫ్యాషన్ రంగంలోనూ అదరగొడుతోంది. ఇటీవల ప్రముఖ డిజైనర్ లేబుల్ కోసం ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మాలిబులో గార్డెన్ ఆఫ్ ఈడెన్ కలెక్షన్‌కి చెందిన ప్యాస్టెల్ బ్లూ కలర్ లెహంగా లుక్‌లో ఆమె ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా గ్లామర్‌కు కొత్త నిర్వచనం ఇచ్చింది. మృదువైన రంగులు, ఆకర్షించే డిజైన్, శ్రియా నడుమున మెరిసే ఆ హావభావాలు... అన్నీ కలగలిపి ఈ లుక్‌ను అద్భుతంగా మార్చేశాయి. ఈ లుక్‌లో కనిపించిన శ్రియా లెహంగా లైట్ బ్లూ షేడ్స్‌తో నాజూకుగా ఉంది. మెరుస్తున్న బ్లౌజు డిజైన్, మ్యాచ్ అయిన స్కర్ట్‌పై ఉన్న నాజూకు పువ్వుల ఎంబ్రాయిడరీ... ఆమెను ఒక ఫెయిరీటేల్ ప్రిన్సెస్‌లా చూపించింది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న జుమ్కాలు, మృదువైన హెయిర్‌స్టైల్ మరింత అందాన్ని జోడించాయి. సోషల్ మీడియాలో ఈ లుక్‌కి అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. శ్రియా శరణ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె దక్షిణాది సినీ ఇండస్ట్రీలోనే కాదు, బాలీవుడ్‌లోను తన ప్రత్యేకతను చాటుకుంది. 'శివాజీ'లో రజనీకాంత్‌కు జోడిగా, 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో బాలకృష్ణ సరసన, అలాగే హిందీలో 'దృశ్యం' సిరీస్‌లో అజయ్ దేవగన్‌కి భార్యగా ఆకట్టుకున్నారు. ఇటీవలి కాలంలోనూ ఆమె 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి పాన్ ఇండియా ప్రాజెక్టుల్లోనూ కనిపిస్తూ, స్టార్డమ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. తన కెరీర్‌కి తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్నా కూడా, శ్రియా సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండి... ప్రతి లుక్‌తోనూ ట్రెండ్ సెట్ చేస్తోంది. ఆమె గ్లామర్‌ను చూస్తే వయస్సు కేవలం ఒక నెంబర్ అనిపిస్తుంది. ఈ ఫోటోషూట్‌లోనూ ఆమె కామ్‌బినేషన్ ఫియర్‌లెస్ ఫ్యాషన్‌ను స్పష్టంగా చూపించింది. ప్రస్తుతం శ్రియా కొన్ని తమిళ, హిందీ సినిమాల్లో నటిస్తోంది. మరోవైపు యాడ్స్, ఫ్యాషన్ ఫోటోషూట్‌లతోనూ బిజీగా ఉంది.


# భాగ్యం ఇదేం మాస్ రాంపేజ్ బాబోయ్..!





టాలీవుడ్ లో కాస్త టాలెంట్ ఉన్న హీరోయిన్ వస్తె చాలు ఆమెకు వరుస అవకాశాలు ఇస్తూ ఎంకరేజ్ చేస్తారు. అయితే ఇది అందరికీ జరుగుతుందా అంటే అలా కాదు. కొందరికి అది కూడా లక్ ఉన్న వారికి మాత్రమే అలా జరుగుతుంది. ప్రస్తుతం అలాంటి లక్కీ గాళ్ గా క్రేజీ ఛాన్స్ అందుకుంటుంది భాగ్య శ్రీ బోర్స్. మాస్ మహారాజ్ రవితేజతో మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ. హరీష్ శంకర్ ఇంట్రడ్యూస్ చేసే హీరోయిన్స్ కి అదేంటో బాగా కలిసి వస్తుంది. ఈ క్రమంలో మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా భాగ్యానికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా, కాంతా సినిమాలు చేస్తుంది. ఈ సినిమాల్లో ఏ ఒక్కటి బ్లాక్ బస్టర్ పడ్డా అమ్మడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇది చాలదు అన్నట్టుగా మరికొన్ని సినిమాలు వచ్చి యాడ్ అవుతున్నాయి. భాగ్య శ్రీ ఖాతాలో లేటెస్ట్ గా అక్కినేని అఖిల్ లెనిన్ కూడా వచ్చి చేరిందని టాక్. శ్రీలీల చేయాల్సిన ఆ సినిమా కాస్త ఆమెకు డేట్స్ అడ్జెస్ట్ అవ్వట్లేదని ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ కాగా ఆ ఛాన్స్ భాగ్య శ్రీ కొట్టేసింది. ఆల్రెడీ సితార బ్యానర్ లో కింగ్ డం చేస్తున్న భాగ్య శ్రీ పనిలో పనిగా మరో ఆఫర్ అందుకుంది. తెలుగులో ఒకే ఒక్క సినిమా అది కూడా ఫ్లాప్ అయిన కూడా భాగ్య శ్రీకి బంపర్ ఆఫర్లు.. చెప్పాలంటే ఒక దానికి మించి మరొక ఆఫర్ అన్నట్టుగా వస్తున్నాయి. అఖిల్ లెనిన్ ఛాన్స్ అయితే ఆమెకు నిజంగానే లక్కీ అనిపించేలా చేసింది. భాగ్య శ్రీ పర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. మిస్టర్ బచ్చన్ లో తన గ్లామర్ ట్రీట్ తో ఆడియన్స్ ని అలరించింది. అంతేకాదు ఆఫ్ స్క్రీన్ కూడా చాలా యాక్టివ్ గా కనిపించింది. అదే అమ్మడికి అవకాశాలు తెచ్చేలా చేస్తుంది. కింగ్ డం సినిమా నుంచి వచ్చిన సాంగ్ తో యూత్ ఆడియన్స్ కి దగ్గరైంది భాగ్య శ్రీ. చూస్తుంటే అమ్మడు టాలీవుడ్ లో కొన్నాళ్లు తన హవా కొనసాగించేలా ఉందనిపిస్తుంది. ఇక రిలీజ్ ల విషయానికి వస్తే భాగ్య శ్రీ నటించిన కింగ్ డమ్ నెక్స్ట్ మంత్ రిలీజ్ అవుతుంది. ఆంధ్రా కింగ్ తాలూకా కూడా త్వరలో రిలీజ్ అవబోతుంది. ఈ రెండు సినిమాలు హిట్లు పడితే మాత్రం భాగ్య శ్రీ రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

# సితార ఘట్టమనేని అలెర్ట్.. జాగ్రత్త అంటూ..



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. చిన్న వయస్సులోనే మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న సితారకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ఆమె చేసే పోస్ట్‌లు, రీల్స్, డ్యాన్స్ వీడియోలు వెంటనే వైరల్ అవుతాయి. ఇలాంటి సమయంలోనే సితార పేరు మీద నకిలీ అకౌంట్లు క్రియేట్ అవుతూ, అభిమానులను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె స్వయంగా వెల్లడించింది. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ల సమస్య కొత్తది కాదు. స్టార్ హీరోలు, హీరోయిన్లు మాత్రమే కాదు, వారి కుటుంబ సభ్యుల పేర్లతో కూడా ఎవరైనా అకౌంట్లు క్రియేట్ చేసి తప్పుదోవ పట్టించే పరిస్థితులు తరచుగా కనిపిస్తుంటాయి. తాజాగా సితార ఘట్టమనేని తన ఇన్‌స్టా అకౌంట్ ద్వారా క్లారిటీ ఇచ్చింది. తన పేరుతో అనేక ఫేక్, స్పామ్ అకౌంట్లు వస్తున్నాయని, వాటిపై జాగ్రత్తగా ఉండాలని అభిమానులకు సూచించింది. సితార చేసిన పోస్ట్‌లో తాను కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లో మాత్రమే యాక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న తన అధికారిక అకౌంట్ ద్వారానే అభిమానులు, స్నేహితులు, వెల్ విషర్స్ కనెక్ట్ అవుతానని చెప్పింది. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో ఎక్కడా తాను లేనని తెలిపారు. అలాగే తన పేరుతో వస్తున్న ఇతర అకౌంట్లను ఫాలో అవ్వకూడదని, వాటితో ఎలాంటి ఇంటరాక్షన్ చేయకూడదని అభిమానులకు హెచ్చరిక ఇచ్చారు. ఈ పోస్ట్‌కు అభిమానులు భారీ స్థాయిలో స్పందిస్తున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు వస్తున్నాయి. భిమానులు తప్పక జాగ్రత్తగా ఉంటాం, నువ్వు చెప్పినట్టే ఆఫీషియల్ అకౌంట్‌ను మాత్రమే ఫాలో అవుతాం అంటూ రిప్లై ఇస్తున్నారు. మొత్తానికి సితార ఘట్టమనేని ఇచ్చిన అలర్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. స్టార్ కిడ్స్‌కు ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా ఇలాంటి సమస్యలు ఎప్పటికప్పుడు రావడం సహజమే. కానీ సితార లాంటి వారు ముందుగానే క్లారిటీ ఇవ్వడం వలన అభిమానులు తప్పుదోవ పట్టే అవకాశం తగ్గిపోతుంది. ఫ్యాన్స్ కూడా ఇప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

# రష్మిక తో హాను శిష్యుడు పెద్ద సాహసమే!




నేషనల్ క్రష్ రష్మిక మందన్నా నేడు పాన్ ఇండియానే షేక్ చేస్తోన్న నటి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో అమ్మడి క్రేజ్ ఆకాశాన్నంటుతుంది. ఇప్పుడిప్పుడే ఆ క్రేజ్ ను సోలోగా ఎన్ క్యాష్ చేసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతో సోలోగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని చూస్తోంది. ఇప్పటికే 'మైసా' అనే చిత్రం చేస్తోన్న సంగతి తెలిసిందే. రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పోస్టర్ లో రష్మిక ఆహార్యం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా రష్మిక కళ్లలో హావభాలు కనికట్టు చేస్తున్నాయి. రష్మిక కళ్లతో నటించగల రేర్ నటి. ఈ రకమైన పెర్ఫార్మెన్స్ గతంలో జ్యోతిక ఇచ్చేది. మేల్ నటుల్లో సూర్య కు మళ్లీ ఆ ఇమేజ్ ఉంది. ఆ తర్వాత మళ్లీ రష్మికకే ఆఛాన్స్ దక్కింది. మైసా చిత్రాన్ని తెరకెక్కి స్తోంది దర్శకుడు హాను రాఘవపూడి శిష్యుడు అని తెలిసింది. పలు సినిమాలకు హాను వద్ద పనిచేసిన రవీంద్ర పుల్లె ఈ సినిమాతోనే దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రష్మిక ట్యాలెంట్ ని...పాన్ ఇండియా క్రేజ్ ని తెలివిగా ఆరంభంలోనే వినియోగించుకుంటున్నాడు. ఇప్పటి వరకూ 'మైసా'పై పాజిటివ్ ఇంప్రెషన్ ఉంది. సినిమాకు మంచి బజ్ క్రియేట్ అవుతుంది. అయితే రష్మికకు ఇదే తొలి లేడీ ఓరియేంటెడ్ చిత్రం. దీంతో తెరపై ఆమెని ఎలా ఆవిష్కరించబోతున్నాడు? అన్న టెన్షన్ రష్మిక అభిమానుల్లో ఉంది. రష్మికకు మేల్ అండ్ ఫీమేల్స్ లో భారీ ఫాలోయింగ్ ఉంది. తనకంటూ ప్రత్యేక మైన ఫ్యాన్ బేస్ ఉంది. రష్మిక కోసమే థియేటర్ కు వచ్చే ఆడియన్స్ ఉన్నారు. అంతటి క్రేజీ బ్యూటీతో లేడీ ఓరియేంటెడ్ అంటే? ప్రేక్షకుల్ని అంతే ఎంగేజ్ చేయాలి. ఇందులో ఎక్కడ తేడా జరిగినా విమర్శలు తప్పవు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని కొత్త దర్శకుడు పని చేయాల్సి ఉంటుంది.

## వాట్సప్‌చాట్ ఆధారంగా విడాకులు మంజూరు చేయలేం



ముంబయి : జీవితభాగస్వామికి ఖండించే అవకాశం కూడా లేకుండా కేవలం వాట్సప్‌చాట్‌ల్లో క్రూరత్వం ఆధారంగా విడాకులు మంజూరు చేయలేమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ, హైకోర్టును ఆశ్రయించిన మహిళ పిటిషన్‌పై ధర్మాసనం పైవిధంగా స్పందించింది. తన వాదనను వినిపించేందుకు లేదా వ్యతిరేకించేందుకు తనకు అవకాశం ఇవ్వలేదని ఆ మహిళ పిటిషన్‌లో పేర్కొంది. భర్త సమర్పించిన సాక్ష్యాలను (వాట్సప్ చాట్‌లను) తోసిపుచ్చడానికి భార్యకు అవకాశం ఇవ్వడంలో కుటుంబకోర్టు విఫలమైందని జస్టిస్ భారతి దాంగ్రే, జస్టిస్ మంజుషా దేశ్ పాండేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేవలం వాట్సప్ చాట్ మీద ఆధారపడి, విడాకులను మంజూరు చేయలేమని నాసిక్ జిల్లా కుటుంబ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను గతవారం ధర్మాసనం కొట్టివేసిన సంగతి తెలిసిందే. భార్య వాదనలు వినిపించడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి అవకాశం కల్పించడానికి ఈ కేసును తిరిగి కుటుంబ కోర్టుకు అప్పగించాలని ధర్మాసనం ఆదేశించింది. మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించేందుకు గత అవకాశాలను కూడా పరిశీలించాలని ధర్మాసనం పేర్కొంది. విడాకులు కోరుతూ మహిళ భర్త తమ వాట్సప్ చాట్‌ను కుటుంబ కోర్టుకు సమర్పించారు. మహిళ తమ నివాసాన్ని నాసిక్ నుండి పూణెకు మార్చాలని, విడిగా ఉండాలని డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. ఆమె తన అత్తగారు మరియు వదినపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. ఆ మహిళ తన వాట్సప్ చాట్‌లో భర్తపై ఒత్తిడి తీసుకువచ్చిందని, భావోద్వేగంతో బ్లాక్‌మెయిల్ చేసిందని, అసభ్యకరమైన భాషను వినియోగించిందని .. దీంతో భర్తపై క్రూరత్వం చూపినందున అతను విడాకులకు అర్హుడని కుటుంబ కోర్టు తీర్పునిచ్చింది.ం

## క్రియాశీల రాజకీయాల్లోకి నితీష్ కుమారుడు




పాట్నా : బీహార్ సీఎం నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ త్వరలో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశముందని పార్టీ సీనియర్ నేత, మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. "హోలీ సందర్భంగా నిశాంత్ త్వరలో రాజకీయాల్లోకి రానున్నారు" అని ఆయన మీడియాకు చెప్పారు. అధికార ఎన్డీఏ మిత్రపక్షమైన జనతాదళ్ (యునైటెడ్) నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 9న ముగియనుంది. వీరిలో రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ ఉన్నారు. మార్చి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు మార్చి 5 నామినేషన్ల గడువు నేపథ్యంలో మంత్రి శ్రావణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి మొత్తం 16 రాజ్యసభ స్థానాల్లో ఐదు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వీటిలో జేడీయూ నుంచి ఇద్దరు, మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చీఫ్ ఉపేంద్ర కుష్వాహా ఒకరు, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతా దళ్ నుంచి ప్రేమ్ చంద్ గుప్తా, అమరేంద్ర ధరి సింగ్ పదవీకాలం ముగుస్తోంది. 243 సభ్యుల అసెంబ్లీలో 202 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఎన్డీఏ సులభంగా నాలుగు స్థానాలు గెలుచుకునే స్థితిలో ఉంది. ఐదో స్థానంపై ఎన్డీఏ, మహాఘటబంధన్ మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. జేడీయూ నుంచి నిశాంత్ కుమార్ పేరుతో పాటు రామ్ నాథ్ ఠాకూర్ పేరు కూడా చర్చల్లో ఉంది. అయితే హరివంశ్ నారాయణ్ సింగ్‌కు ఈసారి అవకాశం దక్కకపోవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ం

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



పశ్చిమాసియా : పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువన కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి. యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.ం

## ఉపాధి పథకాన్ని రద్దు చేసే కుట్ర బిజెపి చేస్తుంది



చీరాల (బాపట్ల) : పేదలకు అనుకూలంగా ఉపాధిపరంగా ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శించారు. బుధవారం ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్ లో ఉపాధి హామీ పథకం గురించి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సభలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు పలువురితో ముందుగా వారి అభిప్రాయాలన్ని బహిరంగంగా తెలిపారు. సభలో వారు చెప్పిన సమస్యలు విన్న అనంతరం షర్మిలా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ .... కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర కొనసాగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా ముందుగా మహాత్ముని పేరు తొలగించి విబి జి రాంజీ ఉపాధి హామీ పథకం అని నామకరణం చేశారన్నారు. తదుపరి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే విధంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పొడిగించామన్నారు. గతంలో వందరోజులకే పని కల్పించిన ఈ పథకాన్ని పేరుకు 125 రోజులు పని దినాలు కల్పించాము అని చెబుతున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో గ్రామంలో పేద ప్రజలే తమకు పనిలేదని ఉపాధి కోసం గ్రామంలో పెద్దలను అధికారులను సంప్రదిస్తే వారికి ఉపాధి చూపించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేవారన్నారు. అయితే ప్రస్తుత నూతన విధానంతో అందుకు అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఎంతో మంచి గొప్ప పథకాన్ని తొలగించే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు. పథకాన్ని గుండు సున్నా చుట్టేలా చేస్తుందన్నారు. ఇది బిజెపికి డబ్బులు వచ్చే పథకం కాదని అందువలన తొలగించారని అన్నారు.

# భారీ జీతంతో సమ్మతృప్తే!

## ఐటీ జాబ్ మార్కెట్లో భిన్నమైన పరిస్థితి ఆసక్తి కలిగిస్తున్న 'బ్లైండ్'యాప్ నివేదిక




భారీ జీతం అందుకోవాలి. వృత్తిపరంగా ఎదగాలి. ప్రపంచస్థాయిలో గుర్తింపు రావాలి. ఇదీ ఓ సగటు భారతీయ టెకీ మనసులో మాట. ఇందుకోసం అంతర్జాతీయ దిగ్గజ టెక్ కంపెనీల్లో పనిచేయాలని ఆకాంక్షిస్తుంటారు. అయితే అధిక వేతనం ఎల్లప్పుడూ పని ప్రదేశంలో సంతృప్తిని, వృత్తిపరమైన ఎదుగుదలను అందించలేదని ఒక నివేదిక వెల్లడించింది. ప్రధాన సంస్థలలో పని వాతావరణాన్ని అంచనా వేయడానికి 40,686 మంది ఉద్యోగుల రేటింగ్స్, జీతాల డేటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ కమ్యూనిటీ యాప్ 'బ్లైండ్'ఓ నివేదికను రూపొందించింది. పని ప్రదేశంలో సంతృప్తి, వృత్తిపరమైన ఎదుగుదల అవకాశాలు, మేనేజ్‌మెంట్ పనితీరును విశ్లేంచింది. మన దేశంలో టెకీలు కోరుకుంటున్న ప్రధాన కంపెనీల జాబితా ఒకటైతే.. భారత్‌లో పనిచేయడానికి ఉత్తమ సంస్థలుగా పేరొందిన సంస్థల జాబితా వేర్వేరుగా ఉండటం ఆసక్తికరం.

### భారీ వేతనం ఉంటే..

పోటీతత్వంతో కూడిన నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన పని ప్రదేశాన్ని ఎంచుకోవడం మునుపటి కంటే ఇప్పుడు చాలా కీలకంగా మారింది. చాలామంది నిపుణులు కేవలం జీతంపైనే కాకుండా వృత్తిపరమైన ఎదుగుదల, పని సంస్కృతి, దీర్ఘకాలిక స్థిరత్వంపై కూడా దృష్టి సారిస్తున్నారు. పని--జీవిత సమతుల్యత ఉద్యోగుల సంతోషాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని తేలింది. కెరీర్‌ను మార్చుకోవాలనుకునే నిపుణులకు జీతం ఇప్పటికీ ప్రధాన ఆకర్షణగా ఉంది. అంటే భారీ వేతనం ఉంటే కెరీర్ మారేందుకు సిద్ధం అన్నమాట.

### టాప్--15లో లేవు..

భారత్‌లో టెకీలు, జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టేవారు అత్యధికంగా కోరుకునే సంస్థల జాబితాను బ్లైండ్ రూపొందించింది. ఇందులో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అట్లాసియన్, ఫ్లిప్‌కార్ట్, జీటా, ఇన్‌మోబి, టెకియన్ కార్ప్, ఊబర్, వాల్‌మార్ట్, సేల్స్‌ఫోర్స్, ఎడోబ్, మెటా, ఒరాకిల్, షేర్‌చాట్ ముందు వరుసలో ఉన్నాయి. బ్లైండ్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ జాబితాలో అత్యుత్తమ రేటింగ్ పొందిన టాప్--10 కంపెనీల్లో ఎన్విడియా, గూగుల్, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్, వీఎమ్‌వేర్, ఎడోబ్, టార్గెట్, క్రెడ్, నోకియా, థాట్‌వర్క్స్ ఉన్నాయి. గూగుల్, ఎడోబ్ మాత్రమే ఈ రెండు జాబితాల్లోనూ నిలిచాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి భారీ వేతనాలు ఇచ్చే కంపెనీలు టాప్--15 బెస్ట్ వర్క్‌ప్లేసెస్‌లో చోటు సంపాదించుకోలేకపోయాయి. ఎన్విడియా, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్ వంటి అత్యుత్తమ రేటింగ్ పొందిన సంస్థలకు అత్యధికంగా కోరుకునే కంపెనీల జాబితాలో స్థానం దక్కలేదు.

### ఉద్యోగుల సెంటిమెంట్..

అధిక జీతాలు ఎల్లప్పుడూ ఉద్యోగ సంతృప్తితో సంబంధం కలిగి ఉండవని ఈ అధ్యయనం ద్వారా వెల్లడైంది. అత్యధిక జీతాలు ఇచ్చే కంపెనీలలో మూడో వంతు కంటే తక్కువ మాత్రమే అత్యుత్తమ రేటింగ్ పొందిన పని ప్రదేశాల జాబితాలో ఉన్నాయి. ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రతిభను ఆకర్షించినప్పటికీ ఉద్యోగులను నిలుపుకోవడంలో, వారిని ఉత్సాహపరచడంలో పని సంస్కృతి, నాయకత్వం కీలక పాత్ర పోషిస్తాయని నిరూపితమైంది. ఉద్యోగుల సంతృప్తి అనేది కేవలం జీతంపై మాత్రమే కాకుండా ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగి ఏదేని కంపెనీలో దీర్ఘకాలం కొనసాగాలంటే నాయకత్వ నాణ్యత, వృత్తిపరమైన అభివృద్ధి, పని సంస్కృతి ఇప్పటికీ కీలకమైనవి. ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు సహాయక వాతావరణాన్ని సమతుల్యం చేసే సంస్థలు మాత్రమే నైపుణ్యం కలిగిన నిపుణులను నిలుపుకోగలవు, బలమైన ఖ్యాతిని నిర్మించుకోగలవని తెలిపింది.

### ఏడాదిలో భారత్‌లోని నిపుణులు వెతికిన కంపెనీలు, పదాలు...

అత్యధికంగా వెతికిన కంపెనీల పేర్లు: మైక్రోసాఫ్ట్, గూగుల్, ఊబర్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, అట్లాసియన్, యాపిల్, క్వాల్‌కామ్, ఈబే. తరచూ సెర్చ్ చేసిన పదాలు: లేఆఫ్, ఆఫర్, హెచ్--1బీ, మెటా ఇండియా, గూగుల్ ఇండియా, మెటా లండన్.

# చందమామ చిక్కేదెవరికి?



దశాబ్దాల తర్వాత జాబిల్లిపై అమెరికా దృష్టిసారించిన మరుక్షణమే చైనా సైతం తన అంతరిక్ష పరిశోధనలకు చందమామను కేంద్రస్థానంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాకెట్లు, వ్యోమనౌకలు, ల్యాండర్‌లతో రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. 2028కల్లా చంద్రునిపై 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్'ద్వారా మానవసహిత ప్రయోగాలను పునరుద్ధరించాలని అమెరికా ప్రణాళికలు రచించింది. ప్రతిరంగంలో అమెరికాతో పోల్చుకుని ఆ దిశగా పావులు కదిపే చైనా ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష వనరులు, దేశ ప్రయోజనాలే పరమావధిగా ముందడుగు వేస్తోంది. దీంతో ఒక్కసారిగా చంద్రుని కేంద్రంగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పోటీకి తెరలేచింది.

చైనా ఎలా సంసిద్ధమవుతోంది?

మానవసహిత ప్రయాణాలు సాధ్యమయ్యేలా అత్యంత శక్తివంతమైన లాంగ్ మార్చ్--10 రాకెట్‌ను చైనా అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన తక్కువ కాలానికి ఇంజిన్‌ను పూర్తి లేదా పాక్షిక సామర్థ్యంతో మండించడం(క్రిటికల్ స్టాటిక్ ఫైర్), ప్రయోగశాలలో రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షించడం(లో ఆతి?టట్యూట్ డెమోన్?రస్టేషన్ టెస్ట్)లను విజయవంతంగా పూర్తిచేసింది. వ్యోమగాములను మోసుకెళ్లే పునర్ వినియోగ క్యాపరీ?స్యల్ 'ది మెంగ్‌జోయూ'ను చైనా పరీక్షిస్తోంది. ఈ క్యాపూస్‌ల్‌తో డైనమిక్ ప్రెషర్ విధానంలో వ్యోమగాములు తప్పించుకునే టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి వ్యోమనౌక గాల్లోకి లేచేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం లాంటివి జరిగితే వ్యోమగాములు తప్పించుకునే మ్యాక్స్ క్యూ అబోర్ట్ టెస్ట్‌నూ విజయవంతంగా పరీక్షించింది. చైనా వ్యోమగాములు(టైకోనాట్స్)ను చందమామ ఉపరితలం మీదకు తీసుకెళ్లే తిరిగి కక్ష్యలోకి తీసుకొచ్చే 'ది లాన్యే లూనార్'ల్యాండర్‌నూ చైనా పరీక్షిస్తోంది. లాన్యే అంటే చందమామను హత్తుకోవడం. ఈ పదాన్ని మావో జెడాంగ్ తన కవితలో తొలిసారిగా ఉపయోగించారు. సిమ్యులేషన్ సమయంలో ఈ ల్యాండర్.. ల్యాండింగ్, టేకాఫ్‌లను అత్యంత ఖచ్చితత్వంతో పూర్తిచేసిందని చైనా ఇటీవలే ప్రకటించింది. చందమామపైకి లాంగ్ మార్చ్--10 రాకెట్ పలు మార్లు ప్రయోగాలకు అనువుగా ప్రయోగవేదికలను విస్తరిస్తున్నారు. లాంచ్‌ప్యాడ్లు, ట్రాకింగ్ స్టేషన్లు, అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో హైనాన్‌లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్‌సైట్‌లో నిర్మాణపనులు వేగవంతమయ్యాయి. వ్యోమగా ములతో కూడిన డీప్--స్పేస్ ఆపరేషన్ల కోసం ఇతర కీలక వసతులను అందుబాటులోకి తెస్తున్నారు.

చందమామ మీదకు వెళ్లేది ఎప్పుడు?

మరో నాలుగేళ్లలో తొలి వ్యోమగాముల బృందాన్ని చందమామ మీద దింపాలని చైనా లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ షెడ్యూల్ ప్రకారం చకచకా జరుగుతున్నాయని 'ది చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ'ప్రకటించింది. "ప్రయోగ పరీక్షలు అన్నీ విజయవంతమవుతూ, మౌలికసదుపాయాల కల్పన పూర్తవుతూ లక్ష్యాన్ని చేరువచేస్తున్నాయి. అంతరిక్ష చరిత్రలో సరికొత్త మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నాం"అని స్పేస్ ఏజెన్సీ పేర్కొంది.

ఈ ఏడాది బిజీబిజీ..

2026లో బిజీ షెడ్యూల్‌తో చైనా దూసుకుపోతోంది. సొంతంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం 'తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్'కు రెండు సార్లు వ్యోమగాములను పంపనుంది. సరకులను పంపేందుకు ఒక ప్రయోగం చేయనుంది. ఒక టైకోనాట్‌ను ఒక పూర్తి ఏడాదికాలం అక్కడే ఉంచనుంది. తద్వారా సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు? అనే అంశంపై అధ్యయనంచేయనుంది. కొత్త మాడ్యూళ్లను తీసుకెళ్లేందుకు హాంకాంగ్, మకావూ నుంచి ఇద్దరు టైకోనాట్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపనుంది. పాకిస్తాన్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వ్యోమగాములకు చైనా స్పేస్‌స్టేషన్ స్వాగతం పలకనుంది.

నాసా మిషన్‌లో వచి?చన మార్పులేంటి?

2027లో దిగువ కక్ష్యలో తొలుత ఒక వ్యోమనౌకను ప్రయోగించనుంది. వాణిజ్య ల్యా?ండర్లతో అనుసంధానం కోసం రిహార్సల్ చేయనుంది. ఈ కమర్షియల్ ల్యాండర్లను స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు రూపొందిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్టిమిస్--2 ప్రాజెక్ట్‌ను అమెరికా చేపట్టనుంది. వ్యోమగాములతో బయల్దేరే వ్యోమనౌక చంద్రుని సమీప కక్ష్యలోకి వెళ్లి అక్కడి నుంచి జాబిలి సమాచారాన్ని సేకరిస్తుంది. చంద్రుని స్వల్ప గురుత్వాకర్షణ శక్తినే వడిసెలా వాడుకుని తిరిగి భూమి దిశలో పయనించనుంది. 2027లో ఆర్టిమిస్--3 ఆ తర్వాత 2028లో ఆర్టిమిస్--4ను అమలుచేయనుంది.

మళ్లీ చందమామపై దృష్టి ఎందుకు సారించారు?

చంద్రుని దక్షిణ ధృవంలోని బిలాల్లో ఘనరూప నీరు ఉందని తాజా పరిశోధనలు బలంగా చెబుతున్నాయి. ఈ నీటిని ఉపయోగించుకుని అక్కడ వ్యోమగాముల కోసం స్థిరనివాసాలు ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తోంది. అక్కడి నుంచి అంతరిక్ష ప్రయోగాలు చేయాలని ఆశిస్తోంది. అరుణ గ్రహంపై యాత్రకు జాబిలిని మజిలీగా మార్చుకోవాలని భావిస్తున్నారు. హీలియం--3 అనే అరుదైన ఐసోటోప్ చందమామపై సమృద్ధిగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వ్యోమగాములు అక్కడ స్థిరపడ్డాక ఈ ఐసోటోప్‌తో కేంద్రక సంలీన చర్య ద్వారా నిరంతరాయంగా కరెంట్‌ను ఉత్పత్తిచేసి విద్యుత్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# పశ్చిమాసియా మంటలు!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూల బాధ్యతారహిత చర్యతో ఒక్కసారిగా పశ్చిమాసియా నిప్పులకొలిమైంది. శనివారం ఉదయం ఒక పథకం ప్రకారం ఇజ్రాయెల్, అమెరికా సైనిక బలగాలు ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక నగరాలు, పట్టణాలపై బాంబులతో, క్షిపణులతో విరుచుకుపడి ఆరంభంలోనే ఇరాన్ మత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీతోపాటు ఆయనతో చర్చిస్తున్న కీలకమంత్రులు, రక్షణరంగ బాధ్యులతో సహా దాదాపు 30 మందిని హత మార్చాయి. పర్యవసానంగా యుద్ధం ఆరంభమైన మూడో రోజుకే ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా దేశాలన్నీ భగ్గున మండుతున్నాయి. అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా సాగుతున్న ఈ దాడులతో కోట్లాదిమంది ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కుని ఉన్నారు. మంగళవారం విమాన రాకపోకలు మొదలెడతామని దుబాయ్ అంటు న్నది. సాధ్యాసాధ్యాలపై సంశయాలున్నాయి. సాధారణంగా యుద్ధం తొలి దశలో దేశాధినేతలు, ఇతర కీలక బాధ్యుల జోలికి పోరు. చర్చలకు రప్పించటం, రాజీ తప్ప మరే మార్గమూ లేదన్న అభిప్రాయం కలిగించడం దీని వెనకుండే వ్యూహం. కానీ ట్రంప్, నెతన్యాహూల దుందుడుకుతనం ఆ అవ కాశానికి శాశ్వతంగా తలుపులు మూసింది. అందుకే యుద్ధం ఎడతెగకుండా సాగుతుందన్న అభిప్రాయం బలపడుతోంది. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడ్డ ఎప్‌స్టీన్‌తో ఉన్న నీతిబాహ్య సంబంధాలు బట్టబయలు కావటం, స్వీయ తప్పిదాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ దివాలా స్థితికి చేరుకుని సాధారణ ప్రజానీకం దుర్భరమైన స్థితిలో బతుకీడ్వటంవంటి పరిణామాల నేపథ్యంలో వచ్చే నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగించారు. అటు పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి పదవీభ్రష్టత్వం, జైలు తప్పవని బెంగటిల్లుతున్న నెతన్యాహూ సరిజోడీ అయ్యారు. ఇద్దరికిద్దరూ ప్రపంచాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టారు. అంతర్జాతీయం మాటెలా ఉన్నా పశ్చిమాసియాకు సంబంధించి అమెరికా మూడున్నర దశాబ్దాలుగా కట్టుకథలతో కాలక్షేపం చేస్తోంది. అకారణంగా దాడులకు దిగుతూ, జనహననానికి పాల్పడుతూ తప్పుడు సాకులు వెదుకుతోంది. మొదట ఇరాక్--కువైట్‌ల మధ్య చిచ్చురగిల్చి, ఆ తర్వాత ఇరాక్‌ను అదుపు చేయడానికంటూ 1990--91లో 'ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్' పేరిట అమెరికా విరుచుకుపడింది. కనీసం అప్పుడు భద్రతా మండలి అనుమతి తీసుకుంది. 35 దేశాలను తోడుతెచ్చుకుంది. అసత్యాలే చెప్పినా దేశ ప్రజలనుద్దేశించి సీనియర్ బుష్ నాలుగు దఫాలు ప్రసంగించారు. కానీ చివరకు అదంతా అమెరికా మాయోపాయం వల్లే జరిగిందని ఆలస్యంగా గ్రహించిన చాలా దేశాలు సీనియర్ బుష్ కుమారుడు జార్జి డబ్ల్యూ బుష్ ఆధ్వర్యంలో సాగిన 2003 నాటి 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్' యుద్ధానికి మొహం చాటేశాయి. 'జీవ రసాయన ఆయుధాల' సాకుతో జరిపిన ఆ యుద్ధానికి బ్రిటన్, పోలెండ్, ఆస్ట్రేలియాలు మాత్రమే సహకరించాయి. భద్రతామండలి ఆమోదం దక్కలేదు. 2015 నాటికి 'జీవ రసాయన ఆయుధాలు' కూడా బూటకమని తేలింది. అందుకే కావొచ్చు... ట్రంప్ భద్రతామండలి సంగతలా ఉంచి, కనీసం చట్ట ప్రకారం అమెరికా ప్రతినిధుల సభ అనుమతి సైతం తీసుకోకుండా ఇప్పుడు చిచ్చు రగిల్చారు. ప్రపంచంలో జరిగే ఏ యుద్ధంలోనూ తలదూర్చబోనని హామీ ఇచ్చి ట్రంప్ గద్దెనెక్కారు. తీరా అందుకు విరుద్ధమైన పోకడలుపోతున్నారు. వాస్తవానికి అమెరికా--ఇరాన్‌లు ఒప్పందానికి చేరువలోవున్నాయని మధ్యవర్తి ఒమన్ ప్రకటించింది. కానీ 24 గంటలు గడవకుండానే ఏకపక్షంగా ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగబడ్డారు. ఇరాన్‌తో స్నేహం నటిస్తూనే సౌదీ ద్రోహం చేసిందనీ, ఖమేనీపై దాడి వెనక దాని పాత్ర ఉన్నదనీ మీడియా కథనం. తమ సైనిక స్థావరాలుంటే ఇరుగుపొరుగు కన్నెత్తి చూడరని చెబుతూ 80వ దశకం నుంచి గల్ఫ్ దేశాలన్నిటా అమెరికా వాటిని నెలకొల్పింది. ఇరాన్ ప్రతీకార దాడులు అదంతా భ్రమగా తేల్చాయి. ఇప్పుడు హోర్మూజ్ జలసంధి మూతబడింది. ట్రంప్-- నెతన్యాహూ ద్వయం కదిలించిన ఈ తేనెతుట్టె ఇంకెన్ని పరిణామాలకు దారి తీస్తుందో,ఎంత జన నష్టానికీ, విధ్వంసానికీ కారణమవుతుందో చూడాల్సి ఉంది.

# గ్యాడ్జెట్స్?:

## ఫుట్ మసాజర్.. దీంతో కండరాలు.. మెడ నొప్పులు ఇట్టే తగ్గుతాయి..




రెగ్యులర్?గా వాకింగ్? చేసేవాళ్లకు అప్పుడప్పుడు పాదాల్లో నొప్పి వస్తుంటుంది. అలాంటప్పుడు దీనిపై కాసేపు నిలబడితే చాలు.. నిమిషాల్లో ఉపశమనం కలుగుతుంది. మిక్సెన్? అనే కంపెనీ ఈ ఆటోమెటిక్? ఎలక్ట్రిక్ ఫుట్ మసాజర్?ని మార్కెట్?లోకి తీసుకొచ్చింది. ఇది వైబ్రేట్అవుతూ పాదాలకు వేడిని ఇస్తుంది. దానివల్ల నొప్పి తగ్గడంతోపాటు రక్త ప్రసరణ కూడా పెరుగుతుంది. వైబ్రేషన్? లెవల్?ని అడ్జస్ట్ చేసుకోవచ్చు. పాదాలు చిన్నగా ఉన్నా, పెద్దగా ఉన్నా సౌకర్యవంతంగానే ఉంటుంది. ఈ మసాజర్?లో ఈఎంఎస్? టెక్నాలజీ వాడారు. అది కండరాల నొప్పి తగ్గించడంలో సాయపడుతుంది. ఇది పోర్టబుల్? సైజులో ఉండడమే కాకుండా ఫోల్డబుల్? డిజైన్?తో వస్తుంది. మడతపెట్టుకుని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. ధర : రూ. 1,999

### మెడ నొప్పికి..

ఈ మధ్య కాలంలో డెస్క్ జాబ్? చేసే చాలామంది నడుము, వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. గంటల తరబడి ఆఫీసుల్లో కూర్చోవడం వల్ల మెడ నొప్పి కూడా కామన్? అయిపోయింది. అలాంటి వాళ్లు ఈ మసాజర్?ని వాడితే నొప్పి నుంచి కాస్త ఉపశమనం పొందొచ్చు. ఫ్లిక్సీపై అనే కంపెనీ ఈ మసాజర్?ని తీసుకొచ్చింది. దీంతో నడుము, భుజాలు, మెడ భాగంలో మసాజ్? చేసుకోవచ్చు. దీనికి ఆరు మసాజ్ హెడ్స్? ఉంటాయి.

మసాజ్? చేసుకునే పార్ట్?ని బట్టి మోడ్స్? మార్చుకోవాలి. మెడ నొప్పిని తగ్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రొఫెషనల్ మసాజర్ ఇది. ఇందులో హీట్ ఫంక్షన్ కూడా ఉంది. రెండు హీట్ కంప్రెస్ సెట్టింగ్స్? ఉన్నాయి. దీన్ని ఆన్? చేసిన 10 నిమిషాల్లో మసాజ్? పూర్తి చేసి ఆటోమెటిక్?గా ఆఫ్? అవుతుంది. ఇది రీచార్జబుల్ లిథియం-అయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. కాబట్టి ఉపయోగించిన ప్రతిసారి కరెంట్?కి ప్లగ్ చేయాల్సిన అవసరం లేదు. ఒకే చార్జ్?పై 70-80 నిమిషాల వరకు మసాజ్ చేస్తుంది. ధర : రూ. 1,499



# చిట్టి పొట్టి స్వీట్స్.. పిల్లలైనా.. పెద్దలైనా సరదాగా హ్యాపీగా తినేవి ఇవే..

సమ్మర్? హాలిడేస్? కొనసాగు తున్నాయి. అమ్మా.. ఏదన్నా తింటానికి పెట్టు.. అంటూ పిల్లలు మారాం చేస్తుంటారు. కొందరైతే బయట పదార్థాలు తీసుకొచ్చి పెడతారు. అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని తెలిసినా .. పిల్లల గోల భరించలేక బయట దొరికే చిరుతిండ్లు తప్పడం లేదు. అలా కాకుండా ఇంట్లోనే వెరైటీగా చాక్లెట్లు, లాలీపాప్, క్యాండీలను తయారు చేసుకోవచ్చు. ఇప్పుడు ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం .. . ఎంత వద్దన్నా... చాక్లెట్లు, లాలీపాప్, క్యాండీలను పిల్లలు తినకమానరు. మరి అలాంటప్పుడు, బయట మార్కెట్లో దొరికే వాటికన్నా, ఇంట్లో తయారు చేసినవి మేలు కదా. అలా ఇంట్లోనే తయారు చేస్తే పిల్లలకే కాదు... తల్లులకు కూడా థ్రిల్? గా ఉంటుంది. చేయాలని ఉన్నా... ఎలా చేయాలో తెలియకే చాలామంది ఆగిపోతారు. అలాంటివాళ్ల కోసమే ఈ రెసిపీలు. మరింకెందుకు ఆలస్యం... వెంటనే ట్రై చేయండి.

### చాకొలెట్? తయారీకి కావాల్సినవి

కొకొవా పొడి : రెండు కప్పులు
మైదా పిండి : పావుటీ స్పూన్
బట్టర్ (వెన్న) : ముప్పావు కప్పు
నీళ్లు : ఒక కప్పు
పాలు : ముప్పావు కప్పు
చక్కెర పొడి: పావు కప్పు

తయారీ విధానం: కొకొవా పొడిని బట్టర్ తో కలిపి మిక్సీలో గ్రైండ్ చేయాలి స్టవ్ వెలిగించి పెద్ద గిన్నెలో నీళ్లు వేడి చేయాలి. అందులో మరో చిన్నగిన్నె పెట్టి కొకోవా మిశ్రమాన్ని వేయాలి. రెండు, మూడు నిమిషాల వరకు కలుపుతూనే ఉండాలి. అందులో గోరువెచ్చని పాలు, చక్కెర పొడి, పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి. మిశ్రమం మృదువుగా అయ్యాక చాకొలెట్ మౌల్డ్స్? లేదా ఫ్రిజ్ ఐస్? ట్రేలో వేయాలి. రెండు గంటల తర్వాత



చాకొలెట్లను బయటికి తీసి, పిల్లలకు ఇవ్వండి సంతోషంగా తింటారు.

### గమ్మీ క్యాండీ తయారీకి కావాల్సినవి

జిలటిన్? షీట్స్? (మార్కెట్లో దొరుకుతాయి): ఆరు
నీళ్లు : అర కప్పు
చక్కెర : అర కప్పు
తా జా నిమ్మరసం : ఒక టేబుల్ స్పూన్
పండ్ల రసం (ఇష్టాన్ని బట్టి పండును ఎంచుకోవచ్చు): అరకప్పు

తయారీ విధానం: జెలటిన్ షీట్లను ఐదు నిమిషాల పాటు చల్లటి నీళ్లలో నానబెట్టాలి మరోవైపు స్టవ్ వెలిగించి పాన్ పెట్టాలి. అందులో మీకు నచ్చిన పండ్ల రసం... నీళ్లు, నిమ్మరసం వేసి కలపాలి. చక్కెర కూడా వేసి మరిగించాలి. మంటను తగ్గించి, చల్లటి నీళ్లల్లోంచి.. జిలటిన్ షీట్లను తీసి అందులో వేయాలి. రెండు నిమిషాల తర్వాత స్టవ్ మీద నుంచి దింపేయాలి. మిశ్రమాన్ని ఏదైనా గిన్నెలోకి తీసుకుని ఐదారు గంటల పాటు ఫ్రిజ్ లో పెట్టాలి. ఆ పెద్దసైజు క్యాండీని నచ్చిన ఆకారం, సైజులో కట్? చేసుకోవాలి. కావాలనుకుంటే వాటిపై పల్చగా నూనె రాసి చక్కెర పొడి దొర్లించవచ్చు.

### టూటీ ఫ్రూటీ తయారీకి కావాల్సినవి

పచ్చి బొప్పాయి: అర కిలో
నీళ్లు :ఏడు కప్పులు
చక్కెర: రెండు కప్పులు
వెనిల్లా ఎసెన్స్ : ఒక టీ స్పూన్
ఫుడ్ కలర్ (ఎరుపు, ఆరు పచ్చ, పసుపు రంగు): ఒక్కోటి నాలుగు చుక్కలు

తయారీ తయారీ విధానం: పచ్చి బొప్పాయి తొక్క తీసి ముక్కలుగా తరుగాలి. తరిగిన ముక్కల్ని నాలుగు కప్పుల నీళ్లలో అయిదు నిమిషాల పాటు ఉడికించాలి. బొప్పాయి ముక్కలు మెత్తగా కాకుండా కొద్దిగా ఉడికితే చాలు ... స్టవ్ వెలిగించి పాన్? పెట్టి మిగిలిన మూడు కప్పుల నీళ్లు పోయాలి. అందులో చక్కెర వేసి కలపాలి. లేత పాకం అయ్యేవరకు... అంటే దాదాపు పదిహేను నిమిషాల వరకు కలుపుతూనే ఉండాలి. తర్వాత దాంట్లో వెనిల్లా ఎసెన్స్, సగం ఉడికిన బొప్పాయి ముక్కలు వేయాలి. కొద్ది సేప య్యాక ముక్కలను మూడు విడివిడి గిన్నెల్లో తీసుకొని, ఒక్కోదాంట్లో ఒక్కో ఫుడ్ కలర్ వేయాలి. వాటిని పన్నెండు గంటలు అరబెట్టాలి. పిల్లలు, పెద్దలు.. ఎంతగానో ఇష్టపడే టూటీ ఫ్రేట్? రెడీ...




### లాలీపాప్? తయారీకి కావాల్సినవి

చక్కెర :ఒక కప్పు
కార్న్ సిరప్? (మార్కెట్లో దొరుకుతుంది) -:అర కప్పు,
నీళ్లు :పావు కప్పు
వెనిల్లా వెసిన్స్ : ఒకటీ స్పూన్
ఫుడ్ కలర్ (నచ్చినది) : తగినంత
పుల్లలు: సరిపడ

తయారీ విధానం: ఒక గిన్నెలో చక్కెర, కార్న్ సిరప్? నీళ్లు పోసి కలపాలి. స్టవ్ వెలిగించి ఆ గిన్నెను సన్నని మంటపై పెట్టాలి. మిశ్రమం చిక్కగయ్యే వరకు కలుపుతూనే ఉండాలి. అది మరుగుతున్నప్పుడు వెనిల్లా ఎసెన్స్, ఫుడ్ కలర్ వేసి బాగా కలిపి దింపేయాలి. ఆ మిశ్రమాన్ని లాలీపాప్ మౌల్డ్స్?, లేదా కాటన్ క్లాత్ మీద వేసి, పుల్లను మధ్యలో పెట్టి కొద్దిసేపు ఫ్రిజ్? లో పెట్టాలి. నోరూరించే రంగురంగుల లాలీపాప్ ను ఎవరైనా ఇష్టపడతారు.

# గెలాక్సీ ఎస్-25 ఎడ్జ్ ప్రీ-ఆర్డర్‌లను ప్రారంభించిన సామ్‌సంగ్




భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, ఈరోజు తమ విభాగాన్ని -నిర్వచించే గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, సన్నని గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ కోసం ప్రీ-ఆర్డర్‌లను ప్రారంభించింది. శైలి మరియు బలాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, స్థిరమైన టైటానియం బాడీలో ప్రీమియం, ప్రో-లెవల్ పనితీరు యొక్క కొత్త సమతుల్యతను తాకుతుంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ఎస్ సిరీస్ వారసత్వాన్ని అందిస్తుంది, ఐకానిక్ గెలాక్సీ ఏఐ -ఆధారిత కెమెరాను ఏకీకృతం చేస్తుంది, సౌకర్యవంతంగా పోర్టబుల్ పరికరంలో సృజనాత్మకత యొక్క కొత్త రంగాన్ని ఆవిష్కరిస్తుంది.

అసాధారణమైన రీతిలో సొగసైన మరియు బలమైన డిజైన్

సన్నని 5.8ఎంఎం చాసిస్‌తో, స్మార్ట్‌ఫోన్ డిజైన్‌లోని దాదాపు ప్రతి అంశాన్ని పునరావిష్కరించే ఇంజనీరింగ్ యొక్క అద్భుతమైన ప్రదర్శన , గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ . దీని మెరుగైన ఫ్రేమ్ బ్రిడ్జెస్ కేవలం 163 గ్రాముల వద్ద రూపుదిద్దుకోవటంతో పాటుగా పనిచేస్తాయి, గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క ఏకీకృత డిజైన్‌కు అనుగుణంగా ఉంటూనే సన్నటి స్మార్ట్‌ఫోన్‌లను తదుపరి స్థాయికి తీసుకువెళతాయి. దాని స్ట్రీమ్‌లైన్డ్ సిల్హౌట్, అసాధారణమైన స్థిరత్వం వస్తుంది. మెరుగ్గా వంగిన అంచులు మరియు దృఢమైన టైటానియం ఫ్రేమ్ రోజువారీ ఉపయోగం కోసం శాశ్వత రక్షణను అందిస్తాయి. ఇంజనీరింగ్ స్థిరత్వంను అందించే కొత్త గ్లాస్ సిరామిక్ ఆఫరింగ్ అయిన తాజా కార్నింగ్_ గొరిల్లా_ గ్లాస్ సిరామిక్ 2, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ లో ముందు డిస్‌ప్లే కోసం ఉపయోగించబడుతుంది.

### పాకెట్ చేయగల 200ఎంపి కెమెరాతో శక్తివంతమైన సృజనాత్మకత

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ యొక్క సన్నటి మరియు తేలికపాటి డిజైన్ వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా చిరస్మరణీయ క్షణాలను ఒడిసిపట్టటానికి మరియు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడానికి సహాయపడుతుంది. 200ఎంపి వైడ్ లెన్స్ గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క ఐకానిక్ కెమెరా అనుభవాన్ని మెరుగు పరుస్తుంది, నైటోగ్రఫీని కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. దాని అల్ట్రా-హై రిజల్యూషన్ దీనికి తోడ్పడుతుంది, వినియోగదారులు పెద్ద పిక్సెల్ పరిమాణంతో స్పష్టమైన షాట్‌లను తీయగలుగుతూనే చక్కటి ఫోటోలను పొందుతారు. తక్కువ-కాంతి వాతావరణంలో 40% కంటే ఎక్కువ మెరుగైన ప్రకాశంతో చిత్రాలను ఇది సంగ్రహిస్తుంది. 12ఎంపి అల్ట్రా-వైడ్ సెన్సార్ ఆటోఫోకస్‌ను కలిగి ఉంది, ఇది మరింత సృజనాత్మక సౌలభ్యం కోసం స్ఫుటమైన, వివరణాత్మక మాక్రో ఫోటోగ్రఫీకి శక్తినిస్తుంది. దుస్తులు లేదా మొక్కల కోసం పదునైన



వివరాలను నిర్ధారించడం మరియు పోర్ట్రెయిట్‌లలో సహజమైన, నిజమైన స్కిన్ టోన్ వంటి ప్రో-గ్రేడ్ మెరుగుదలలతో గెలాక్సీ ఎస్ 25 కోసం మెరుగుపరచబడిన అదే ప్రోవిజువల్ ఇంజిన్ నుండి గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రయోజనం పొందుతుంది. ఆడియో ఎరేజర్ మరియు డ్రాయింగ్ అసిస్ట్ వంటి అభిమానుల-ఇష్టమైన వాటితో సహా గెలాక్సీ ఏఐ -ఆధారిత ఎడిటింగ్ ఫీచర్‌లు అన్నీ గెలాక్సీ ఎస్ 25 సిరీస్ నుండి తీసుకురాబడ్డాయి.

### అల్ట్రా-స్లిమ్ స్మార్ట్ ఫోన్ లో గరిష్ట పనితీరు నైపుణ్యంగా అందుబాటులోకి తీసుకురావటం జరిగింది

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ అనేది గెలాక్సీ కోసం స్నాప్ డ్రాగన్ 8_ ఎలైట్ మొబైల్ ప్లాట్‌ఫామ్‌తో ప్రారంభించి ప్రీమియం పనితీరును అందించడానికి నిర్మించబడింది. క్వాల్ కామ్ టెక్నాలజీస్ , ఇంక్. ద్వారా అనుకూలీ కరించబడిన, చిప్‌సెట్ గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ యొక్క ఆన్-డివైస్ ఏఐ ప్రాసెసింగ్ సామర్థ్యాలకు శక్తినిస్తుంది మరియు రోజంతా విశ్వసనీయంగా వేగవంతమైన పనితీరును అందిస్తుంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ నిరంతర ఉపయోగంలో కూడా చల్లగా ఉంటుంది, ఎందుకంటే ఇది ఇప్పుడు రి కాన్ఫిగర్ చేయబడిన వాపర్ ఛాంబర్ కలిగి ఉంటుంది, అయితే స్థిరమైన రీతిలో వేడి వెదజల్లడానికి వెడల్పుగా ఉంటుంది. గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రోస్కేలర్‌తో అధునాతనమైన మరియు సమర్థవంతమైన ఏఐ ఇమేజ్ ప్రాసెసింగ్‌ను కలిగి ఉంది, ఇది డిస్ప్లే ఇమేజ్ స్కేలింగ్ నాణ్యతలో 40% మెరుగుదలను అందిస్తుంది, అదే సమయంలో సామ్‌సంగ్ యొక్క అనుకూలీకరించిన మొబైల్ డిజిటల్ నేచురల్ ఇమేజ్ ఇంజిన్ ను కలుపుతుంది.

### గెలాక్సీ ఏఐతో విశ్వసనీయ సహచరుడు

దాదాపు ప్రతి టచ్‌పాయింట్‌లో గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ మా అత్యంత సహజమైన మరియు సందర్భోచిత మొబైల్ ఏఐ అనుభవాలను అందిస్తుంది. వినియోగదారులు తమ వ్యక్తిగత డేటా ఎల్లప్పుడూ సురక్షితంగా ఉంటుందని మనశ్శాంతితో వ్యక్తిగతీకరించిన, మల్టీమోడల్ ఏఐ సామర్థ్యాలను పొందుతారు.

విస్తృత గెలాక్సీ ఎస్25 సిరీస్‌ను ప్రతిబింబిస్తూ, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ బహుళ యాప్‌లలో సజావుగా పనిచేసే ఏఐ ఏజెంట్‌లను ఏకీకృతం చేస్తుంది, పనులను మరింత సులభంగా పూర్తి చేయడానికి నిజమైన ఏఐ సహచరుడిగా సహాయపడుతుంది. గెలాక్సీ ఏఐ రోజువారీ దినచర్యలతో అను సంధానించడంలో కూడా మెరుగ్గా ఉంటుంది.

నౌ బ్రీఫ్ మరియు నౌ బార్ లో ఎక్కువ సౌలభ్యం కోసం , రోజువారీ ప్రయాణం, భోజనం మరియు మరిన్నింటి సమయంలో సహాయకరమైన రిమైండర్‌ల కోసం మూడవ పక్ష యాప్ ఇంటిగ్రేషన్‌లు ఉన్నాయి. గూగుల్‌తో గెలాక్సీ యొక్క లోతైన అనుసంధానం కారణంగా, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ జెమిని యొక్క తాజా పురోగతులను మరింత మంది వినియోగదారులకు తీసుకువస్తుంది. ఉదాహరణకు, జెమిని లైవ్ యొక్క కొత్త కెమెరా , స్క్రీన్ షేరింగ్ సామర్థ్యాలతో, వినియోగదారులు తమ స్క్రీన్‌పై లేదా తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో చూసే వాటిని జెమిని లైవ్‌కు చూపించవచ్చు, అదే సమయంలో లైవ్ సంభాషణలో దానితో సంభాషించవచ్చు.

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ లో గెలాక్సీ ఏఐ ద్వారా అందించబడే అనుభవాలు కేవలం అనుకూలమైనవి మాత్రమే కాదు, అవి గోప్యతతో రూపొందించబడ్డాయి.

పరికరంలోని ఏఐ ప్రాసెసింగ్ సామ్‌సంగ్ నాక్స్ ద్వారా డేటాను సురక్షితంగా ఉంచుతుందని నిర్ధారిస్తుంది, హైపర్-వ్యక్తిగతీకరించిన మొబైల్ అనుభవాలు గోప్యతను ఎప్పుడూ త్యాగం చేయవని నిర్ధారించుకోవడానికి సామ్‌సంగ్ యొక్క అచంచలమైన నిబద్ధతను కొనసాగిస్తుంది.

### ధర, లభ్యత మరియు ప్రీ-ఆర్డర్ ఆఫర్లు

అన్ని ప్రముఖ ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్‌లలో నేటి నుండి గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రీ-ఆర్డర్‌ల కోసం సిద్ధంగా ఉంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ను ప్రీ-ఆర్డర్ చేసే కస్టమర్‌లు రూ. 12,000 విలువైన ఉచిత స్టోరేజ్ అప్‌గ్రేడ్‌ను అందుకుంటారు. కస్టమర్‌లు పరికరంపై 9 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ ని కూడా పొందవచ్చు. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ రెండు ఆకర్షణీయమైన రంగులలో అందుబాటులో ఉంటుంది - టైటానియం సిల్వర్ మరియు టైటానియం జెట్‌బ్లాక్. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ మరియు గెలాక్సీ ఎస్25 సిరీస్ గురించి మరింత సమాచారం కోసం ,దయచేసి Sam sung.comని సంద ర్శించండి.

# ఈ పండు మార్కెట్లో కనిపిస్తే వెంటనే కొనుగోలు చేయండి.. ఎందుకంటే?




: శరీరానికి అదనపు శక్తి ఇచ్చేందుకు రోజు తినే ఆహారం కాకుండా ఇతర ఆహార పదార్థాలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. వీటిలో పండ్లు అయితే శరీరానికి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా పండ్లు తినడానికి చాలామంది ఇష్టపడరు. కానీ పండ్లలో కార్బోహైడ్రేట్లూ.. విటమిన్లు.. ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఇవి తినడం వల్ల తక్షణమే శక్తి వస్తుంది. అయితే అన్ని రకాల పనులలో కాకుండా కొన్ని రకాల్లో అధికమైన పోషకాలు ఉంటాయి. వాటిలో డ్రాగన్ ఫ్రూట్ ఒకటి. డ్రాగన్ ఫ్రూట్ చూడడానికి బాగో లేకపోయినా.. ఇందులో పోషకాలు మెండు అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇంతకీ డ్రాగన్ ఫ్రూట్లో ఎలాంటి పోషకాలు ఉన్నాయో చూద్దాం.. ఇటీవల మార్కెట్లో



డ్రాగన్ ఫ్రూట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఏదైనా అనారోగ్యానికి గురైతే డ్రాగన్ ఫ్రూట్ తినాలని వైద్యుల సైతం సూచిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అందువల్ల అనారోగ్యానికి గురైనప్పుడు డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల తక్షణ ఎనర్జీ వస్తుంది. అంతేకాకుండా ఇందులో కెరోటిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల నుంచి శుభవార్తలు ఉపశమనం చేసేలా సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్స్ తినడం వల్ల షుగర్ లెవెల్స్ ను కంట్రోల్ లో వస్తాయి. దీనిని రెగ్యులర్గా తీసుకోవడం వ్ల గుండె కూడా మెరుగ్గా పనిచేస్తుంది. ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు మాత్రమే కాకుండా సాధారణ సమయంలో డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల నిత్యం ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ఇందులో ప్రోబయోటిక్స్ ఉండడం వల్ల జీర్ణ క్రియను పెంపొందిస్తుంది. అలాగే మలబద్ధకం సమస్య ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా ఫ్రీ రాడికల్స్ ను పెరగనియ్యకుండా చేసి క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో శరీరానికి ఎలాంటి అదనపు



కొవ్వు చేరకుండా ఆరోగ్యంగా ఉండగలు గుతారు. డ్రాగన్ ఫ్రూట్స్ లో మెగ్నీషియం, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి పిల్లలతో పాటు మహిళలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రక్తహీనతతో బాధపడేవారు డ్రాగన్ ఫ్రూట్ ను రెగ్యులర్ గా తీసుకోవాలి. ఎముకలు బలంగా ఉండాలంటే డ్రాగన్ ఫ్రూట్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. ప్రస్తుత కాలంలో కాలంతో సమయం లేకుండా అన్ని సమయాల్లో డ్రాగన్ ఫ్రూట్ అందుబాటులో ఉంటుంది. అయితే వీటిని కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన డ్రాగన్ ఫ్రూట్ మాత్రమే తీసుకోవాలి. కల్తీగా మారిన డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. అంతేకాకుండా వీటిని కొనుగోలు చేసే సమయంలో పాడైపోయినవి ఉన్నాయా లేవా అనేది చూడాలి. కడుపు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న డ్రాగన్ ఫ్రూట్ తో పరిష్కారం చేసుకోవచ్చు. అందువల్ల ఇది మార్కెట్లో కనిపిస్తే వెంటనే కొనుగోలు చేయండి.



# రెండు పెగ్గులూ మంచిది కాదు.. క్యాన్సర్ వచ్చే అవకాశం..



: మద్యపానం హానికరం అని ఎన్నో రకాలుగా బోర్డులు కనిపించిన చాలామంది మద్యం తాగడం మారడం లేదు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు.. రిలాక్స్ కావడానికి మద్యం తాగుతున్నామని చాలామంది చెబుతున్నప్పటికీ ఇది తాత్కాలికంగానే ఉపశమనం ఇస్తుందని.. దీర్ఘకాలికంగా అనేక వ్యాధులకు దారితీస్తుందని ఇప్పటికే ఎంతోమంది వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే కొంతమంది గుండె సమస్యలు లేకుండా ఉండడానికి రోజుకు రెండు పెగ్గులు వేయడం నష్టం కాదని చెప్పినా.. మరి కొందరు మాత్రం రెండు పెగ్గులు కూడా ఇబ్బందికరమే అని.. మద్యం మొత్తం మానివేయడమే చాలా బెటర్ అని చెబుతున్నారు. అయితే తాజాగా నిర్వహించిన ఓ సర్వే ప్రకారం మద్యం తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలు లోకి వెళ్తే.. 2025 జనవరి లో అమెరికన్ సర్జన్ జనరల్ ప్రకారం.. లక్ష వరకు గుర్తించిన క్యాన్సర్ కేసుల్లో 20000 కేసులు మద్యం ద్వారా వచ్చిన వే అని గుర్తించారు. అలాగే అంతకుముందు 2023 సంవత్సరంలో ప్రచురించిన కొన్ని అధ్యయనాల ప్రకారం 70 శాతం మంది ఆల్కహాల్ బారినపడి ఆ తరువాత క్యాన్సర్ ముప్పునకు గురైనట్లు తేలింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ప్రతి ఏడాది 7.5 లక్షల మంది మద్యం తాగిన వారు క్యాన్సర్కు గురైనట్లు తేలింది. ఇందులో భారత్లో 62,000, చైనాలో 2.8 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నట్లు తేలింది. మద్యం తాగడం వల్ల ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, పేగు క్యాన్సర్, అన్నవాహిక సమస్యలు, కాలేయ సమస్యలు, నోటి క్యాన్సర్ వంటివి గుర్తించినట్లు కొందరు పరిశోధకులు తేల్చారు. అందువల్ల మద్యలో ఎంతో కొంత అని అనకుండా మొత్తంగా మానివేయడమే మంచిది అని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత కాలంలో మద్యలో అనేక రకాల పదార్థాలు కలుస్తున్నాయని.. ఇవి ఒక్కోసారి విషయంగా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా కల్తీ మద్యం సేవించడం వల్ల ప్రాణాలకే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు. మొన్నటి వరకు బ్రాండెడ్ మద్యం మంచిదనే భావన ఉండేది. కానీ ఇప్పుడు మద్యం ఏదైనా శరీరానికి హానికారమే అని తెలుపుతున్నారు. చాలామంది మానసికంగా ప్రశాంతతకు అలాగే ఒత్తిడి నుంచి దూరం కావడానికి మద్యం సేవిస్తూ ఉంటారు. అయితే మద్యానికి బదులు ప్రత్యామ్నాయంగా ఇతర అలవాట్లు చేసుకోవాలని.. అవి ఆరోగ్యకరమైనవి ఉండాలని చెబుతున్నారు. మద్యం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అందువల్ల దీనికి దూరంగా ఉండటమే మంచిది అని చెబుతున్నారు. అయితే కొన్ని దేశాల్లో మహిళలు కూడా ఎక్కువగా మద్యం సేవిస్తున్నట్లు గుర్తించారు. ఇలా ఎక్కువగా మహిళలు మద్యం తాగిన వారిలో అధికంగా క్యాన్సర్ బారిన పడిన విషయాలు బయటకు వస్తున్నాయి. అంతేకాకుండా కొందరు సరదాగా వీకెండ్ లో తీసుకోవాలని అనుకున్న అది ముప్పుగానే పరిగణించాలని చెబుతున్నారు. అయితే ఇప్పటికే మద్యం అలవాటు ఉన్నవారు మానుకోవాలంటే మెల్లిగా దూరం కావాలని.. ఒకేసారి మద్యం మానివేయడం కూడా మంచిది కాదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.


NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .